RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 144 | శుక్రవారం, 13 డిసెంబర్, 2024 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-




## నాలుగు రోజుల పాటు ధరణి సేవలు బంద్

**డేటాబేస్ వర్షన్ అప్‌గ్రేడ్ చేయనున్న నేపథ్యంలో ధరణి సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటన**

హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజుల పాటు ధరణి పోర్టల్ సేవలు బంద్ కానున్నాయి. డేటాబేస్ వర్షన్ అప్‌గ్రేడ్ చేయనున్న నేపథ్యంలో ధరణి సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి అప్‌గ్రేడేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నెల 16వ తేదీ సోమవారం ఉదయానికి ఈ అప్‌గ్రేడేషన్ ప్రక్రియ ముగియనుంది. కాబట్టి ఈ మధ్యకాలంలో ధరణి సేవలు అందుబాటులో ఉండవని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నిజానికి గత మూడు రోజుల నుంచే ధరణి సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుధవారం నుంచి ధరణి ఓటీపీలు కూడా రావడం లేదని మీ సేవా నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. అంతకంటే ముందు రెండు రోజులు ధరణి పోర్టల్ ద్వారా కేవలం సేల్ డీడ్ మాత్రమే అయ్యాయని చెబుతున్నారు. టీఎం 33, గిఫ్ట్ డీడ్స్ వంటి మాడ్యుల్స్ పనిచేయలేదని అంటున్నారు.

# ఎస్సీ వర్గీకరణ అమలు కోసం

- జనవరి 27 న " వెయ్యి గొంతులు - లక్ష డప్పులతో" దండోరా ప్రదర్శన
- వర్గీకరణ జరిగితే విజయోత్సవ డప్పు - లేదంటే అడ్డుకునే వాళ్లకు చావు డప్పు
- మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలి
- మాదిగ కళాకారులను విస్మరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- ప్రభుత్వం గుర్తించిన ప్రముఖలలో
  తెలంగాణ కోసం త్యాగం చేసిన నేతలను ఎందుకు విస్మరించారు ?
- కళాకారులలో, ప్రముఖులలో మహిళల స్థానం ఎక్కడ ?
- కెసిఆర్ ,రేవంత్ రెడ్డి పెట్టిన బొమ్మలు తెలంగాణకు తల్లులు కారు




- ఎస్సీ వర్గీకరణ అమలు కోసం

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ప్రెస్ మీట్ లో మాట్లాడారు.జనవరి 27 న హైదరాబాదులో ఎస్సీ వర్గీకరణ కోసం 1000 గొంతుకలు లక్ష డబ్బులు తో మాదిగ దండోరా ప్రదర్శనను నిర్వహిస్తాం అని ఆయన వెల్లడించారు. అప్పటికే ఎస్సీ వర్గీకరణ అమలులోకి వస్తే విజయోత్సవ డప్పులు మోగిస్తాం అని, లేకపోతే వర్గీకరణను అడ్డుకునే వాళ్లకు చావు డబ్బును మోగిస్తాం అని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో అంతిమ పోరాటం మాదిగ కళాకారుల 1000 గొంతులు లక్ష డబ్బులతో జరిగే ప్రదర్శన మాదిగ కళాకారులు కవులు రచయితలే నాయకత్వం వహిస్తారు అని మందకృష్ణ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ కోరుకునే శక్తులను ఎస్సీ వర్గీకరణను మద్దతిచ్చే శక్తులను భాగస్వాములు చేస్తాం అన్ని వర్గాల కళాకారులను ఈ కార్యక్రమంలోకి ఆహ్వానిస్తాం. ఈ కార్యక్రమం సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న నిలువెత్తు అంబెద్కర్ విగ్రహం ముందు నుండి వేయి గొంతులు లక్ష డప్పుల ప్రదర్శన ప్రారంభమై నెక్లెస్ రోడ్ మీదుగా బయలుదేరి సంజీవయ్య పార్క్ నుండి ట్యాంక్ బండ్ మీదుగా లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు ప్రదర్శన కొనసాగుతుంది . ఈ కార్యక్రమాన్ని విజయవంత చేయడానికి మాదిగ కళాకారుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్రలు మొదలవుతాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 9 మంది కళాకారులను గుర్తించి వారికి కోటి రూపాయల బహుమతి 300 గజాల స్థలం ఇస్తున్నట్లు ప్రకటించడం జరిగింది ఆ తొమ్మిది మంది కళాకారులో మాల సామాజిక వర్గానికి చెందిన ఐదుగురికి గుర్తించడం జరిగింది. మాదిగ కళాకారులను గుర్తించడంలో ప్రభుత్వం వివక్షత చూపెట్టింది అని మందకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.తొమ్మిది మంది కళాకారులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం కానీ మాదిగ కళాకారులను గుర్తించకపోవడం సరైంది కాదు అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ధూంధాం ద్వారా జీవం పోసిందే మాదిగ కళాకారులు తెలంగాణ కళాకారులు అంటేనే మాదిగలు అలాంటి మాదిగ కళాకారులను విస్మరించి తొమ్మిది మందిని ఎంపిక చేయడం అందులో మాదిగలు లేకపోవడం బాధాకరం. అందేశ్రీ మాదిగ అని కొంతమంది ప్రచారం చేస్తున్నప్పటికీ ఆయన విశ్వనరుడను,నేను మాదిగ కాదు అని చెప్పుకున్నాడు . కళాకారుల ఎంపిక విషయంలో ప్రభుత్వం పున సమీక్ష చేసి మాదిగ కళాకారులను గుర్తించాలని కోరుతున్నాం. తెలంగాణ ప్రముఖులలో ప్రభుత్వం తెలంగాణ ఉద్యమం కోసం త్యాగం చేసిన ఎంతోమంది నేతలను విస్మరించింది. ముచ్చర్ల సత్యనారాయణ భూపతి కృష్ణమూర్తి లాంటి పోరాటయోధులను ప్రభుత్వం విస్మరించిందిని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే అమరవీరుల స్థూప రూప శిల్పి ఎక్క యాదగిరి రావును గుర్తించడాన్ని స్వాగతిస్తున్నాం కానీ ఎక్కా యాదగిరి రావు ని తక్షణమే శాసనమండలికి ఎంపిక చేసి సరైన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం అని మందకృష్ణ మాదిగ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన కళాకారుల్లో, ప్రముఖుల్లో మహిళలకు స్థానం లేకపోవడం దారుణం. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల్లో పురుషులతో పాటు స్త్రీలు కూడా సమానంగా పాటలు పాడి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. వారికి సరైన గుర్తింపు ఇవ్వకపోవడం బాధాకరం అని అలాగే తెలంగాణ ఉద్యమానికి ద్రోహాన్ని గుర్రైనప్పుడు ముందుకొచ్చి తెలంగాణ పోరాటాన్ని నడిపించిన టిఎన్ సదా లక్ష్మీ ని తెలంగాణ ప్రముఖుల్లో గుర్తించకపోవడం సరైన కాదు అని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని గతంలో కేసీఆర్ పెడితే అది తనలాగే ఉందని కెసిఆర్ కూతురు కవిత ఒప్పుకున్నారు. కాబట్టి రేవంత్ రెడ్డి మరొక తల్లిని తీసుకురావాలని కొత్త విగ్రహం పెట్టించాడు అయితే ఆ విగ్రహం పెట్టిన రోజే ఆ తల్లిని చూస్తే చిన్నతనంలో వాళ్ళ అమ్మని చూసినట్టుగా ఉందని రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పాడు కనుక తెలంగాణ తల్లి విగ్రహం రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా వాళ్ళ తల్లి రూపమే ఉంది తప్ప మరొకటి కాదు.కేసీఆర్ పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గాని రేవంత్ రెడ్డి పెడుతున్న విగ్రహం గానీ తెలంగాణ తల్లులుగా మేం అంగీకరించం అని మందకృష్ణ మాదిగ అన్నారు.తెలంగాణ తల్లి అంటే చాకలి ఐలమ్మ మాత్రమే.అణగారిన వర్గాల తల్లుల జీవన విధానాలకు ప్రతిరూపంగా ఉండే తెలంగాణ తల్లి విగ్రహాన్ని మేమే స్థాపించుకుంటాం అని ఆయన స్పష్టం చేశారు.

## లగచర్ల రైతుకు బేడీపై సీఎం సీరియస్

- రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై సీఎం ఆగ్రహం
- రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సిన అవసరం ఏంటని అధికారులపై సీఎం ఫైర్
- ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ





హైదరాబాద్

లగచర్ల రైతుకు బేడీల ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి అధికారులను ఆరా తీశారు. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సిన అవసరం ఏంటని అధికారులపై సీఎం ఫైర్ అయ్యారు. ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి చర్యలను సహించేదిలేదని




## జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- ఈ సమావేశాల్లోనే సభ ముందుకు బిల్లు
- బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడమే తరువాయి
- విస్తృత సంప్రదింపుల కోసం జేపీసీ సిఫార్సు చేసే అవకాశం
- ఈ బిల్లుపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల అసెంబ్లీల స్పీకర్‌లనూ ఆహ్వానించనున్నట్టు సమాచారం.
- 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' బిల్ విషయంలో కీలక నిర్ణయం

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని చంపేయాలని చూస్తున్నారా?

- ఏఐసీసీ నేతలపై జగ్గారెడ్డి ఫైర్



హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్: అధికారంలో ఉన్న పార్టీ ఉండేది ఇలాగేనా? ఇంచార్జీలు పార్టీని చంపేయాలని చూస్తున్నారు అని జగ్గారెడ్డి విమర్శించారు. ఇంతకు ఏఐసీసీ కార్యదర్శులు ఉన్నారా? వేరే రాష్ట్రం వెళ్ళిపోయారా? అని అన్నారు.దీపాదాస్ మున్షీ ఉందా? తను కూడా వేరే రాష్ట్రం వెళ్ళిపోయిందా? కొత్త వాళ్ళకు పదవులు ఇచ్చేస్తారా? ఫైనల్ అయ్యేవరకు మాకు చెప్పరా? ఓ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి విష్ణుపై జగ్గారెడ్డి నిప్పులు చెరిగారు.

## సమానత్వ మనస్తత్వాన్ని పెంపొందించేందుకు క్లీన్ ఈక్వల్ మిషన్‌ను పరిచయం చేసిన ఐటీసీ నిమైల్

- సమానత్వంతో కూడిన భవిష్యత్తు కోసం క్లీన్ ఈక్వల్ టుడేని సమిష్టిగా నిర్మించే ఆలోచన రేకెత్తించే, కార్యాచరణ ఆధారిత ప్రయత్నం




హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్, డిసెంబరు 12, 2024 భారతదేశంలో విశ్వసనీయ గృహ పరిశుభ్రత బ్రాండ్, వేపతో తయారైన ఐటీసీ నిమైల్ తన క్లీన్ ఈక్వల్ మిషన్ ద్వారా మరింత బాధ్యతాయుతమైన భవిష్యత్తు వైపు ఒక స్పృహతో ముందడుగు వేసింది. పలు నివాసాలలో ఇంటి పనులను, ముఖ్యంగా శుభ్రపరిచే ప్రాథమిక బాధ్యతను మహిళలు తీసుకుంటారు. ఆ పని వారే చేయాలని ఎక్కువ మంది భావిస్తూ ఉంటారు. తదుపరి తరంలో అవగాహన పెంచడం, దీన్ని ప్రేరేపించడం ద్వారా శుభ్రపరచడంలో సమానత్వాన్ని పెంపొందించేందుకు అనువుగా ఈ కార్యక్రమాన్ని సంస్థ రూపొందించింది. క్లీన్ ఈక్వల్ మిషన్ అనేది భాగస్వామ్య బాధ్యతగా శుభ్రపరచడాన్ని ప్రోత్సహించేందుకు, పిల్లల కోసం వినూత్నమైన విద్యా మాడ్యూల్‌ను కలిగి ఉంది. సమాజంలో మార్పు తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా, ఇది నేటి తరం బాలలకు శుభ్రంగా ఉండడం, పరిశుభ్రతకు సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు స్వాతంత్ర్యం, సమానత్వపు లోతైన భావనతో ఎదిగేందుకు వీలు కల్పిస్తుంది పిల్లలు సాధారణంగా ఇంటిలో చేసే మొదటి పని శుభ్రపరచడం. చిన్న వయస్సు నుంచే పనులు చేయడం భవిష్యత్తులో మరింత సంతృప్తికరమైన, విజయవంతమైన జీవితానికి పునాది వేస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పనులు చేయడం ద్వారా వారు ఆత్మవిశ్వాసాన్ని, జట్టుగా పని చేసే నైపుణ్యాలను పెంపొందించుకుంటూ విలువలతో కూడిన దృఢమైన భావాన్ని అభివృద్ధి చేసుకోవడంలో సహాయపడుతుంది. మరీ ముఖ్యంగా, ఇది వారి భవిష్యత్తుకు కీలకమైన స్వాతంత్ర్యాన్ని అందిస్తుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహిళల డబుల్స్ (టెన్నిస్)లో మాజీ ప్రపంచ నంబర్ 1, సానియా మీర్జా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సానియా మీర్జాతో పాటు ఐటిసి లిమిటెడ్ మార్కెటింగ్, పర్సనల్ కేర్ ప్రొడక్ట్స్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ శ్రీనివాస్, గీతాంజలి దేవ్‌శాల ప్రిన్స్‌పల్, గీతాంజలి గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్ మాధవి చంద్ర మరియు గ్లెన్ డొమన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన నిష్ణాతులైన విద్యావేత్త, పేరెంటింగ్ మెంటార్ కిరణ్మయి చౌదరితో కలిసి క్రియాశీలకమైన చర్చాగోష్ఠిని నిర్వహించారు. ది ఇన్‌స్టిట్యూట్స్ ఫర్ అచీవ్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ పొటెన్షియల్, ఫిలడెల్ఫియా, యూఎస్‌ఏకు చెందిన కిరణ్మయి చౌదరి క్లీన్ ఈక్వల్‌పై ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న తల్లిదండ్రులను మరింత మార్గదర్శనం చేశారు. ఆకర్షణీయమైన, వయస్సుకు తగిన విద్యా కంటెంట్‌తో, ఈ కార్యక్రమం సానుకూలమైన, ఆహ్లాదకరమైన మరియు సాపేక్ష మార్గంలో బాధ్యతను స్వీకరించేలా పిల్లలను ప్రేరేపిస్తుంది. ఈ చొరవ పాఠశాలలు, తల్లిదండ్రులతో ఒక సహకార కార్యక్రమం కాగా, ఇది క్లీన్ ఈక్వల్ ఆలోచనను విశ్లేషించుకోవడంలో పిల్లలకు సహాయపడేందుకు, వారిని సమానత్వానికి విలువనిచ్చే బాధ్యతగల వ్యక్తులుగా ఎదిగేందుకు వీలు కల్పిస్తుంది ఈ చొరవను సానియా మీర్జా ప్రశంసిస్తూ, "ఐటిసి నిమైల్ క్లీన్ ఈక్వల్ మిషన్‌లో భాగంగా ఉండడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. ఈ ప్రయత్నం నా విలువలు, బాధ్యతాయుతమైన తల్లిదండ్రుల అవసరాన్ని లోతుగా ప్రతిధ్వనిస్తుంది. ఇది కేవలం శుభ్రపరచడం కన్నా ఎక్కువబీ ఇది భాగస్వామ్య బాధ్యత భావాన్ని పెంపొందించడం, ఆకట్టుకునే విధంగా చిన్న వయస్సు నుంచే సమానత్వం మనస్తత్వాన్ని పెంపొందించడానికి సంబంధించిన అంశం. మనలాంటి తల్లిదండ్రులు, పాఠశాలలు, పిల్లలు మరింత సమానమైన మరియు బాధ్యతాయుతమైన రేపటి కోసం సమిష్టిగా కలిసి పని చేసేలా ప్రోత్సహించే ఈ చర్చాగోష్ఠిని నిర్వహించినందుకు ఐటీసీ నిమైల్ బృందాన్ని నేను తప్పక అభినందించాలి!" అని పేర్కొన్నారు. ఐటీసీ లిమిటెడ్ పర్సనల్ కేర్ ప్రొడక్ట్స్ బిజినెస్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్ సత్పతి మాట్లాడుతూ, "ఐటీసీ నిమైల్ క్లీన్ ఈక్వల్ మిషన్ చిన్న వయస్సు నుంచే సమానత్వ విలువలను పెంపొందించడం ద్వారా




సానుకూల మార్పును తీసుకువచ్చేందుకు మా అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. ఇంటి పనులకు బాధ్యత వహించడం, యాజమాన్య బాధ్యతలు తీసుకోవడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం అనేది సమాజంలో ఈ మార్పును ప్రేరేపించేందుకు ఒక ప్రాథమిక మార్గం. ఈ కార్యక్రమం పిల్లలు సమిష్టి కృషి, స్వాతంత్ర్యం, సాధికారతల భావాలను పెంపొందించడంలో సహాయపడుతుందని, భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతమైన పెద్దలుగా మారడానికి వారిని ప్రోత్సహిస్తుందని మేము విశ్వసిస్తున్నాము" అని ధీమా వ్యక్తం చేశారు. నిమైల్ క్లీన్ ఈక్వల్ మిషన్ అనేది సరళమైన ఇంకా శక్తివంతమైన ఆలోచనతో నిర్మించబడింది: ఇంటి పనులు, శుభ్రపరచడంతోపాటు, పనులు కన్నా ఎక్కువబీ అవి జీవన నైపుణ్యాలను నేర్పడానికి, సొంత విలువను పెంపొందించేందుకు, పరిశుభ్రత, శుభ్రంగా ఉండడం, సమానత్వాన్ని పెంపొందించే అవకాశాలు. ఈ కార్యక్రమం పాఠశాలల ద్వారా నిమగ్నమవ్వడానికి ప్రయత్నిస్తూ, తల్లిదండ్రులు ఈ అభ్యాసాలను వారి పిల్లల జీవితాలలో ఆకర్షణీయమైన, వయస్సుకు తగిన కార్యకలాపాల ద్వారా ఏకీకృతం చేయడంలో సహాయపడుతుంది. నిమైల్ క్లీన్ ఈక్వల్ మిషన్ హైదరాబాద్‌లో దాని మొదటి దశలో 1 లక్ష కన్నా ఎక్కువ మంది విద్యార్థులకు చేరువైంది. రాబోయే కొద్ది నెలల్లో, ఈ చొరవ భారతదేశంలో 8 లక్షల కన్నా ఎక్కువ మంది విద్యార్థులకు చేరువ అవుతూ, దాని విస్తరణను మరింత పెంచుకోనుంది.

# సంపాదకీయం

## అడ్వకేట్ల గౌరవం కాపాడాలి!

2019%–%20లలో సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ సర్టిఫికెట్లు ఐదు సంవత్సరాల కాలపరిమితికి జారీ చేశారు. అవి తయారు చేసి ఇచ్చేసరికి 2022 వచ్చేసింది. 2020, 2021లలో కరోనా వల్ల కోర్టులు జరగలేదు. అయినా 2025 జనవరి 1కి సర్టిఫికెట్ల కాల వ్యవధి ముగిసినందున మరల ఐదేళ్లకి రెన్యువల్, కొత్తగా ఐదు సంవత్సరాల ప్రాక్టీస్ ముగిసినవారు వెరిఫికేషన్ చేయించుకోవాలని బార్ కౌన్సిల్ సర్క్యులర్ ఇచ్చింది. దాని ప్రకారం డిసెంబర్ 21లోగా సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ అప్లికేషన్లు పంపించుకోవాలి. 2019%–%2020లలో సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ అప్లికేషన్లు పెట్టమని అన్నప్పుడు, డిగ్రీ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయాలని, ఫేక్ సర్టిఫికెట్లు ఉన్నవారిని తొలగించాలన్నది ఉద్దేశ్యమని చెప్పారు. కొన్ని ఫేక్ సర్టిఫికెట్లు కనుగొన్నట్లు ప్రకటించారు. అయితే సకాలంలో అప్లికేషను పెట్టుకోలేని వారు, కొన్ని కారణాల వల్ల డిగ్రీ సర్టిఫికెట్లు దగ్గర లేని వారు సర్టిఫికెట్లు పొందలేకపోయారు. వారిలో చాలా మంది సక్రమంగా బిఎల్/ఎల్ఎల్బి చదివి డిగ్రీ పొంది, బార్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారున్నారు. వీరంతా గౌరవప్రదంగా అడ్వకేట్ అనే స్టేటస్ ఉంచుకోవాలి అనుకున్నవారే. అలాగే కొంతమంది ఆడవాళ్ళు కుటుంబ బాధ్యతల వలన ఏక్టివ్ ప్రాక్టీస్ చేయలేకపోయినా, తమ అడ్వకేట్ హోదా ఉంచుకుని, తెలిసిన వారికి సలహాలు ఇస్తూ గౌరవం పొందుతున్నారు... ఇలాంటి వారు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ పొందలేకపోయారు. ఇప్పుడు మళ్లీ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ రెన్యువల్ అప్లికేషన్లు పెట్టమని ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం అడ్వకేట్ ప్రాక్టీస్ చేస్తున్నట్లుగా చూపించడానికి 5 వకాల్తాలు, 5 మెమో ఆఫ్ అప్పియరెన్స్‌లు, డ్రాఫ్టింగ్ డీడ్స్‌కు సంబంధించిన ఆధారాలు పెట్టాలి. లేదా కోర్టు వెబ్‌సైట్ లేదా కాజు లిస్టులో న్యాయవాది పేరు ఉంటే వాటిని, లేదా తీర్పు/ఆర్డరు కాపీలలో న్యాయవాది పేరు ఉంటే వాటిని జతపరచాలి. ఈ ఆధారాలు జత చేయకపోతే బార్ కౌన్సిల్ లిస్టు నుంచి సదరు అడ్వకేట్ పేరును తొలగిస్తారు. వారు ప్రాక్టీస్ చేయడానికి, ఓటింగులో పాల్గొనడానికి అర్హత కోల్పోతారు. ఈ నిబంధనలు అడ్వకేట్లకు సమస్యగా మారుతున్నాయి. బార్ కౌన్సిల్ ఎన్నికలలో ప్రాక్టీస్ చేస్తున్న వారినే ఓటర్లుగా నమోదు చెయ్యాలని, బార్ కౌన్సిల్ సభ్యులుగా ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్లకే అవకాశం కల్పించాలి అనుకోవడం కొంత సబబే. కానీ ఎన్నికలకు, బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్ ఎన్‌రోల్‌మెంట్‌కు ముడిపెట్టడం సరైనది కాదు. అడ్వకేట్ చట్టం, బార్ కౌన్సిల్ రూల్స్ ప్రకారం న్యాయ డిగ్రీ పొంది, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారందరూ అడ్వకేట్లుగా ప్రాక్టీస్ చేయడానికి అర్హులు. కానీ ఈ నిబంధనల వల్ల కొందరు అడ్వకేట్లకు సమస్య వస్తోంది. కొంతమంది అడ్వకేట్లు ఛాంబర్ ప్రాక్టీస్ చేస్తూ ఉంటారు. వారి సలహాలు, డ్రాఫ్టింగ్ కక్షిదారులకు, సహ న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరం. వారు రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయకపోయినా అడ్వకేటుగా గౌరవం పొందుతుంటారు. మరికొంత మంది అడ్వకేట్లు తమ సీనియర్ల దగ్గర పనిచేస్తూ ఉంటారు. సాధారణంగా సీనియరు మాత్రమే కోర్టులో వకాల్తా వేస్తారు. జూనియర్ అడ్వకేట్ వకాల్తానామాపై సీనియర్‌తో పాటు సంతకం చెయ్యకపోయినా, సీనియర్ తరపున కేసు విచారణ చేసే విధానం అమలులో ఉంది. కొన్ని కారణాల వల్ల జూనియర్ అడ్వకేట్లతో వకాల్తా సంతకం చేయించరు. కోర్టుల్లో వకాల్తా వేసి కేసులు వాదించడమే కాదు, తాము న్యాయ డిగ్రీ పొందిన జ్ఞానంతో నలుగురికి అవసరమైన న్యాయ సలహాలు ఇవ్వడం కూడా అడ్వకేట్లకు గౌరవం. అందుకు అడ్వకేట్‌గా రిజిస్ట్రేషన్, గుర్తింపు ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పుడు ఈ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ నిబంధనల వల్ల వారందరూ అడ్వకేట్ గుర్తింపునకు దూరమవుతున్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, ఆడిటర్లు... తమ అసోసియేషన్లలో సభ్యులకు ఇటువంటి నిబంధనలు పెట్టలేదు. డాక్టర్లు వైద్యం చేయకపోయినా, ఇంజనీర్లు ఏ ప్రాజెక్టులలో పనిచేయక పోయినా, ఆడిటర్లు ఆడిట్లు చేయకపోయినా, వారందరినీ అసోసియేషన్లలో సభ్యులుగా ఉండనిస్తున్నారు. అటువంటప్పుడు అడ్వకేట్లకే ఈ ప్రాక్టీస్ నిబంధనలు ఎందుకు రూపొందించారో తెలియదు. ఇది ఎవరి ఆలోచన అయినా ఆమోదయోగ్యంగా లేదు. అడ్వకేట్లు, వారి సంఘాలు, బార్ అసోసియేషన్లు దీని గురించి సరైన ఆలోచన చేయాలి. బార్ కౌన్సిల్ ఎన్నికలలో ఓటర్లుగా పాల్గొనడానికి వేరే పద్ధతులలో ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టవచ్చు. అంతేకానీ బార్ కౌన్సిల్ ఎన్నికల ఓటర్ల జాబితాకు, బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్‌గా రిజిస్ట్రేషన్‌కు ముడి పెట్టడం సరికాదు. అడ్వకేట్ అనేది ఒక గౌరవం. ప్రాక్టీస్ చేసినా, చేయకపోయినా, అడ్వకేట్‌గా ఎన్‌రోల్‌మెంట్ కావడం న్యాయ డిగ్రీ పొందిన వారి హక్కు, గౌరవం. ఆ గౌరవాన్ని కాపాడండి.

# బీమా స్ఫూర్తిని కూలదోసే చట్ట సవరణలు!

ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ %–% ఎఫ్‌డిఐ) 74శాతం నుంచి 100 శాతానికి పెంచనున్న ప్రతిపాదనలపై డిసెంబర్ 10లోపు ప్రజల నుంచి అభిప్రాయాలు కోరుతూ ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ అఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్) ఓ ప్రకటన చేసింది. ఆర్థిక అంశాల మీద ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే అవకాశాలు ఈ దేశంలో చాలా తక్కువ. నిజంగా అలాంటి అభిప్రాయాలు స్వీకరించాలనుకుంటే ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ఏజెంట్లు, ఏజెంట్ల సంఘాలు, పాలసీదారులు, ఇతరత్రా మేధావుల నుంచి సేకరిస్తే ప్రయోజనం ఉండేది. ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వాలే అయితే 1998లోనే దేశవ్యాప్తంగా ఒక కోటీ 65 లక్షల సంతకాలు సేకరించి ఇన్సూరెన్స్ రంగంలో ప్రైవేట్ కంపెనీలకు అవకాశం ఇవ్వొద్దని అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి గారికి సమర్పించడం జరిగింది. ఇంకా అనేక సందర్భాలలోనూ సదరు ఎఫ్‌డీఐలు ఏ విధంగా సేవల రంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఇన్సూరెన్స్ రంగానికి నష్టం కలిగిస్తాయో కూడా ప్రభుత్వాలకు విడమర్చి చెప్పడం జరిగింది. ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డీఐ పెంపుదలపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ముందు కూడా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ అమానుల్లా ఖాన్, కామ్రేడ్ కె.వేణుగోపాల్ తమ వాదనలు వినిపించి ఒప్పించారు కూడా. కానీ ఇలాంటి ఏ సందర్భంలోనూ ప్రజాభిప్రాయానికి గానీ సంఘాల అభిప్రాయాలకు గానీ విలువ ఇవ్వకుండా ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇన్సూరెన్స్ రంగంలోకి ఎఫ్‌డీఐలను క్రమం తప్పకుండా పెంచుతూనే ఉంది. 1990 తర్వాత నూతన ఆర్థిక విధానాలలో భాగంగా ఇన్సూరెన్స్ రంగంలోనికి ప్రైవేట్ వ్యక్తులు ప్రవేశించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. 1995 వరకు ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో నడిచే ఇన్సూరెన్స్ రంగాన్ని రెగ్యులేట్ చేయడం కోసం ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ (ఐఆర్ఏ) అనే ప్రతిపాదనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. పార్లమెంట్‌లో ఈ బిల్లును పాస్ చేయించడం కోసం నాటి ఆర్థిక మంత్రులు ఐకే గుజ్రాల్, పి.చిదంబరం వేరు వేరు సందర్భాల్లో ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. 1999లో అధికారంలోకి వచ్చిన వాజ్‌పేయి ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ఐఆర్ఏ అనే పదాన్ని ఐఆర్‌డీఏ (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా నామకరణం చేస్తూ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ సాయంతో బిల్లును ఆమోదింపజేసుకున్నది. ఈ బిల్లు పాస్ అయినప్పుడు ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలు రావచ్చు అయితే 26 శాతం మాత్రమే ఎఫ్‌డీఐలు ఉండాలన్న నిబంధన ఉంచారు. ఆశించిన మేర ప్రైవేట్ కంపెనీలు నమోదు కాకపోవడంతో ఎఫ్‌డీఐని మరింత పెంచాలని తద్వారా ఫారిన్ కంపెనీస్ వస్తాయని చాలా ప్రయత్నాలు చేశారు. కానీ యూపీఏ%–%1 ప్రభుత్వానికి ప్రభుత్వ రంగాలకు పెద్దపీట వేసే వామపక్ష పార్టీల మద్దతుతో ఉండడంతో అది సాధ్యపడలేదు. మళ్ళీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2015లో ఎఫ్‌డీఐ 26 నుండి 49 శాతానికి పెంచారు. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదనే నెపంతో 2021లో దీనిని 74 శాతానికి కూడా పెంచారు. ఆ తర్వాత కూడా ఈ 25 ఏళ్ల కాలంలో అన్ని ప్రైవేట్ కంపెనీలు కలిపి 25 సంఖ్యను కూడా చేరుకోలేకపోయాయి. అంచేత ఇప్పుడు ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలను పెంచడం ద్వారా పుట్టగొడుగుల్లా ప్రైవేట్ కంపెనీలు వెలసి ఇన్సూరెన్స్ రంగాన్ని అభివృద్ధిపరచగలవని కేంద్ర ప్రభుత్వం గాలిలో మేడలు కడుతున్నది. అనగా ఇకపై దేశీయ భాగస్వామ్యం కలిగిన కంపెనీలేవీ ఇన్సూరెన్స్ రంగంలో ఉండకుండా విదేశీ కంపెనీలు తమ దుకాణాలను ఇక్కడ తెరవవచ్చు. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ఇన్సూరెన్స్ చట్టాల సవరణ బిల్లులో అనేక ప్రమాదకర ప్రస్తావనలు ఉన్నాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రారంభించాలంటే వంద కోట్ల కనీస మూలధనం అవసరం. ఇప్పుడు దాన్ని తగ్గించాలన్న ప్రతిపాదన ఇందులో ఉన్నది. ఎల్ఐసీ ఆఫ్ ఇండియా పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్నది కాబట్టి వంద కోట్ల మూలధనం అవసరం లేదని మొర పెట్టుకున్నా వినకుండా ఎల్ఐసీ ఆఫ్ ఇండియా నుంచి వంద కోట్ల మూలధనాన్ని ఏర్పాటు చేయించారు. ఇప్పుడు ఇదే నిబంధనను విదేశీ కంపెనీలను సంతృప్తిపరచడం కోసం తొలగిస్తున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు సింగల్ రిజిస్ట్రేషన్‌తో లైఫ్, జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకోవచ్చు. ఈ కాంపోజిట్ లైసెన్స్‌తో అడ్వర్స్ (నష్టదాయకమైనది) సెలక్షన్ జరగవచ్చనే ఆలోచనకు చరమగీతం పాడుతున్నారు. ఇన్సూరెన్స్ ఏజెంట్లు కూడా మూడు లైఫ్ ఇన్సూరెన్స్, మూడు జనరల్ ఇన్సూరెన్స్, మూడు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఒకే లైసెన్స్‌తో పనిచేయవచ్చని మరో ప్రతిపాదన చేశారు. దీంతో ఏజెంట్ల వ్యవస్థ అస్తిత్వం ప్రమాదంలో పడనున్నది. ఇన్సూరెన్స్ సంస్థలు తమ ప్రధాన విధి అయినటువంటి బీమా కల్పనతో పాటు ఇతర ఇండెమినిటీ వ్యాపారాలు, ఆస్తిపాస్తుల అమ్మకాలు కొనుగోళ్లు వంటి ఇతర వ్యాపారాలు కూడా చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. దీనిద్వారా ప్రధాన ధ్యేయం పక్కదారి పడుతోంది. బీమా 'సుగమ్' పేరున 'ఇన్సూరెన్స్ సొల్యూషన్స్ ఫ్రమ్ వన్ ప్లేస్' అనే ప్రతిపాదన ద్వారా ఇన్సూరెన్స్ మూలసూత్రాలు, విలువలు ప్రమాదంలో పడనున్నాయి. ఇలాంటి సరళీకరించబడిన విధానాలు ప్రైవేట్ కంపెనీలకు లాభాల కోసం ఎంతకైనా ఒడిగట్టే అవకాశాన్ని ఇస్తాయి. దీర్ఘకాలిక కాంట్రాక్టులకు ఆలవాలమైన ఇన్సూరెన్స్ రంగంలో ఇలాంటి సరళీకరణ విధానాలు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఇలాంటి కీలక అంశంపై ప్రజల నుండి మొక్కుబడి అభిప్రాయాన్ని సేకరణలు కాకుండా ఇన్సురెన్స్ రంగంలోని సంఘాలతో చర్చిస్తే మంచిది.

# తెగలూ పగలూ తెగని మణిపూర్ సమస్య!

ఏదో ఒక తత్వంలేని రాజకీయమే లేదు. అది సంకుచితమైతే చాలా ఇబ్బంది. ఇక అది మతం, తెగ చుట్టూ తిరిగేదైతే మరింత ఇబ్బంది. ఆ ఇబ్బంది తెచ్చే అనర్థం ఇంతనీ చెప్పలేం. మణిపూర్ హింసాకాండను ఈ కోణం నుంచి చూస్తేనే అర్థం చేసుకోగలం. మతం, ప్రాంతం, తెగ పునాదిగా రాజకీయాలను నడపటం నిప్పుతో చెలగాటమనటానికి దశాబ్దాలుగా రగులుతున్న అక్కడి వైషమ్యాలే నిదర్శనం. మతం, ప్రాంతం, తెగ, భాషలనేవి ప్రజల అస్తిత్వాలే. కాదనలేం. ఇవి కొనసాగాలని కోరుకోటాన్ని తప్పుపట్టలేం! అస్తిత్వాల రక్షణ పోరాటాల్లో సందర్భాన్ని బట్టి ఏదో ఒక పక్షం వైపున న్యాయమూ ఉండొచ్చు. దాన్నీ కాదనలేం. ఆ సహేతుకతనూ విస్మరించలేం. కానీ విశాల ఆధునిక దృక్పథాన్ని విస్మరించి అస్తిత్వాలనే పట్టుకుని వేలాడితే రాజకీయాలూ సంకుచితమవుతాయి. అస్తిత్వ అనుకూల వాదనల్లో ద్వేషంపాళ్లు పెరగటమూ అందుకే జరుగుతోంది. ప్రజాస్వామిక ప్రవర్తన పడిపోవటమూ కనిపిస్తోంది. మణిపూర్‌లో మూడు ప్రధాన జన సమూహాలైన మెయిటీలు, కుకీలు, నాగాలు సంకుచిత అస్తిత్వ రాజకీయాలపై ఆధారపడి సంఘర్షించినప్పుడల్లా హింస పెట్రేగింది. ఏదో ఒక సమూహానికి అపరిమిత అధికారం తోడైతే పరిస్థితి మరింత విషమిస్తుంది. మెయిటీలు మణిపూర్‌లో అధిక సంఖ్యాకులు. జనాభాలో 53 శాతం వారే. వారు అనుసరించేది వైష్ణవ హిందూమతం. సారవంతమైన మైదాన భూములపై వారిదే ఆధిపత్యం. వ్యాపారాలు, పరిశ్రమలు, సేవలు, ఉద్యోగాలు, భవన నిర్మాణం, ప్రసారసాధనాలు... ఇవీ అవీ అని కాదు... ఆధునిక ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అన్ని రంగాల్లోనూ మెయిటీలదే పైచేయి. రాజకీయాల్లో వారికి తిరుగులేదు. రాజకీయ పదవుల్లో కుకీలు, నాగాలు వారి దరిదాపులకు రాలేరు. దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఒకే కులం వారు ఉండి.. ఆర్థికరంగంపై ఆధిపత్యాన్ని నెలకొల్పుకుని, మతపరంగా సంఘటిత శక్తిగా వ్యవహరిస్తూ, నిరంతరం సాంస్కృతికంగా తమని తాము ఉన్నతులుగా భావించుకుంటూ, రాజకీయ బలం చేజారకుండా పావులు కదుపుతుంటే ఎటువంటి పరిస్థితి తలెత్తుతుంది! దాన్ని మనం కలలో కూడా ఊహించలేం! కులవ్యవస్థను ఎంతగా తిట్టుకున్నా ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రాంతంలోనూ ఒక కులానికి 50 శాతం సంఖ్యా బలాన్ని అది కల్పించలేదు. 20శాతం ఓట్లున్న కులాలు ఒకటి రెండుంటేనే గొప్ప! ఒకవేళ ఉన్నా వాటి బలం ఒకచోట గాక అక్కడక్కడా చెల్లాచెదురై ఉంటుంది. ఏ కులానికి సంఖ్యాపరమైన ఆధిపత్యాన్ని ఇవ్వని ఈ వ్యవస్థే మన ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా కొందరు పాశ్చాత్య మేధావులు భావించారు. ఏ రకంగా చూసినా ఒక కులానికి 20 శాతం ఆధిపత్యం ఎక్కడా ఉన్నట్లు కనిపించదు. కానీ కుకీలు, నాగాలు మాత్రం మణిపూర్‌లో 50 శాతం పైగా ఆధిపత్యాన్ని చూస్తున్నామని భావిస్తున్నారు. అంతటి ఆధిపత్యం ఉన్న వాళ్లు వినయం ప్రదర్శిస్తూ వివేక దృష్టితో అభివృద్ధి ఫలాలు సమాజంలో ఇతర వర్గాలకు కొంతైనా చేరే ఏర్పాట్లను చేస్తే పరిస్థితి వేరేలా ఉంటుంది. మణిపూర్‌లో అది జరుగుతోందని చెప్పలేం. బలమైన వర్గాలు ఆధిపత్య ప్రదర్శనలు చేసినా చేయకపోయినా... మితిమీరిన అసమానతలు వైషమ్య భావనలను పెంచుతాయి. చట్టబద్ధ పద్ధతుల్లోనే పైకి వచ్చామన్న భావన పైవర్గాలకు ఉండొచ్చు. పోటీ ప్రపంచంలో ప్రతిభతో నెగ్గామనే సిద్ధాంత ఊతమూ ఉండొచ్చు. అసమానతలు ఎంత పురాతనమైనవో వాటిని ప్రశ్నించే చరిత్రా అంతే పురాతనమైంది. తెగల అస్తిత్వంతో మమేకమయ్యే భావన బలంగా ఉన్నచోట తేలికగా సంఘటితమయ్యే అనుకూలతా ఉంటుంది. అట్లా ఉన్నచోట సంపదలో సముచిత వాటాలను ఆయుధబలంతో పొందాలన్న ప్రయత్నాలూ ఎక్కువగా ఉంటాయి. మణిపూర్‌లో నిరంతరం కాకపోయినా చాలా సందర్భాల్లో జరుగుతున్న చరిత్ర అదే! మణిపూర్ మారణహోమాలను తరచి చూస్తే కనిపించేది ఈ దృశ్యమే. మెయిటీలు అక్కడి జనాభాలో 53 శాతం ఉన్నా వారు ప్రధానంగా ఉండేది ఇంఫాల్ (6 జిల్లాలు) లోయలోనే. దీని విస్తీర్ణం 10 శాతం మాత్రమే. మిగతా 90 శాతం (10 జిల్లాలు) కొండ ప్రాంతాలే. కుకీలు(16శాతం), నాగాల (20 శాతం) నివాసం అక్కడే. ముస్లింలు 8.4 ఉంటారు. కుకీలు, నాగాలు ప్రధాన తెగలైనా వీటిల్లో చేరే అన్ని తెగలను లెక్కిస్తే మొత్తం 33కు పైనే ఉంటాయి. ఇక పోరాట మార్గం పట్టిన మిలిటెంట్ గ్రూపులు 30కు పైగా ఉన్నాయి. అంటే సగటున ఒక లక్షకు ఒక మిలిటెంట్ గ్రూప్ ఉన్నట్లు! మొత్తం జనాభానే 32 లక్షలకు కాస్త అటుఇటుగా ఉంటుంది. ప్రతి మిలిటెంటు గ్రూపూ ఏదో ఒక ప్రధాన తెగ, ఉపతెగ అస్తిత్వాల రక్షణకు పోరాడేవిగా ప్రకటించుకున్నాయి. మెయిటీ, కుకీ, నాగాలుగా వర్గీకరించి ప్రజలను పిలవటం ఇప్పుడు సాధారణమైనా ఒకప్పుడు పలు తెగలను విడివిడిగానే పిలిచేవారు. బ్రిటిషు పాలకులు తమ పాలనా సౌలభ్యం కోసం సన్నిహితంగా ఉన్న తెగలను కలిపేసి పెద్ద సమూహాలుగా వర్గీకరించారు. నాగాలు, కుకీల జాబితాలో చాలా తెగలను అలాగే కలిపేశారు. వైష్ణవాన్ని అనుసరించే తెగలను మెయిటీలుగా వర్గీకరించారు. ఏకీకరణ బాగా జరిగి మెయిటీల్లో ఐక్యత బాలా బలపడింది. కులాలను కృత్రిమంగా వర్గీకరించి వందల ఏళ్ల నుంచి అవి స్థిరంగా ఉన్నట్లుగా ఎలా నమ్మేటట్లు చేయగలిగారో ఈశాన్య భారత తెగల విషయంలోనూ అలాగే చేశారు. జనాభా లెక్కలతో కులాలకు కొత్త బలాన్ని బ్రిటిషు పాలకులు కలగచేశారన్న వాదనా ఉంది. ఎన్నికల రాజకీయాలు కులాల అస్తిత్వాలను ఇంకా గట్టిపరచాయి. మిలిటెంట్ గ్రూపుల్లో కుకీ, నాగాలతో పాటు మెయిటీలు కూడా ఉన్నారు. ఒక దశలో కుకీల్లో 22 మిలిటెంట్ గ్రూపులు ఉంటే మెయిటీల్లో 10, నాగాల్లో 2 ఉండేవి. ఈ మిలిటెంట్ గ్రూప్‌ల్లో ఇప్పటికీ కొన్ని కొనసాగుతున్నాయి. కమ్యూనిస్టు భావజాలంతో ప్రేరణ పొందినవి కూడా వీటిల్లో ఉన్నాయి. లెనిన్ ప్రతిపాదించిన జాతుల స్వయంనిర్ణయాధికార సిద్ధాంతం అందుకు కారణం. మణిపూర్ తెగల సంఘర్షణకు చాలా చరిత్ర ఉంది. దాని వెనుక భూముల కోసం ఆరాటాలూ ఉన్నాయి. ప్రాంతాలపై ఆధిపత్యాల కోసం పెనుగులాటలూ ఉన్నాయి. ఉద్యోగాల్లో విద్యా సీట్లల్లో వాటాలు కాపాడుకోవాలన్న వ్యూహాలూ ఉన్నాయి. కిందటి ఏడాది మే నెల నుంచి మెయిటీలు%–%కుకీల మధ్య మొదలైన హింసకు రిజర్వేషన్ల వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశమే ప్రధాన కారణమైంది. మెయిటీలు తమను ఎస్టీల్లో చేర్చాలని 40 ఏళ్ల నుంచి డిమాండు చేస్తున్నారు. ఆ మేరకు కేంద్రానికి సిఫార్సుచేస్తూ నివేదికను పంపాలని రాష్ట్రాన్ని ఆదేశించాలని మెయిటీలు పిటీషను వేశారు. హైకోర్టు ఆ మేరకు ఆదేశాలు ఇవ్వటంతో కుకీలు, నాగాలు భగ్గుమన్నారు.

కొండ ప్రాంతాల్లో గిరిజనేతరులు భూములు కొనటంపై నిషేధం ఉంది. 10 శాతం భూభాగంలో 50 శాతానికి పైగా జనాభా సర్దుకోవటం కష్టమనే వాదనను మెయిటీలు ఎప్పటి నుంచో చేస్తున్నారు. ఒకప్పుడు తామూ ఎస్టీలుగానే ఉన్నామనీ దాన్ని పునరుద్ధరణను మాత్రమే కోరుతున్నామని మెయిటీలు చేస్తున్న వాదనను అంగీకరిస్తే మణిపూర్ సామాజిక స్వరూపమే మారిపోతుంది. మెయిటీలకు కొండ ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేసే అవకాశం లభిస్తుంది. ఇక మెయిటీలను 1995లోనే ఓబీసీలుగా గుర్తించారు. రెండు ఉపతెగలను కూడా 1956లోనే ఎస్సీల జాబితాలో చేర్చారు. హైకోర్టు తీర్పు వ్యతిరేక ఆందోళనల్లో హింస తలెత్తటానికి కుకీల్లో, నాగాల్లో ఎప్పటి నుంచో మెయిటీలకు వ్యతిరేకంగా గూడు కట్టుకున్న ఆగ్రహమే ప్రధాన కారణం. తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలతో ప్రత్యేక రాష్ట్రం చేయాలన్న డిమాండును కుకీలు ఎప్పటి నుంచో చేస్తూనే ఉన్నారు. కనీసం ప్రత్యేక పాలనా ప్రాంతాన్నైనా ఏర్పాటుచేసి స్వయంప్రతిపత్తి ఇవ్వాలనే డిమాండుతోనూ ఆందోళనలు చేశారు. బీరెన్‌సింగ్ ముఖ్యమంత్రి (2017) అయిన నాటి నుంచి నల్లమందు తయారీలో ఉపయోగించే గసగసాల సాగుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున చేపట్టిన చర్యలు కూడా వివాదమయ్యాయి. కుకీలతో సోదర సంబంధం ఉన్న మయన్మార్ తెగలు రాష్ట్రంలో చొరబడుతున్నాయని బీరెన్‌సింగ్ ఆరోపించారు. అడవుల్లో సర్వేలు నిర్వహించి ఆక్రమణదారుల్ని భూముల నుంచి తొలగించారు. అన్ని అక్రమ కార్యకలాపాల్లో కుకీల పాత్రే ఎక్కువనే రీతిలో పలుచోట్ల చేసిన వ్యాఖ్యలు మరింత అగ్గిని పుట్టించాయి. బీరెన్ ప్రతి మాటా చేతా తమకు వ్యతిరేకంగా ఉన్నట్లుగా కుకీలు భావించారు. అడవుల్లో కొత్త ప్రాంతాలకు విస్తరించటం తమ సంప్రదాయ హక్కనీ దీనికి గండికొడుతున్నారన్న కోపం కూడా కుకీల్లో నెలకొంది. తెగల పురాతన గాథలు ఆధారంగా ప్రస్తుతం తాము మెజారిటీగా లేని ప్రాంతాలు సైతం కుకీలు తమకే చెందుతాయని వాదిస్తున్నారు. కుకీలకు నాగాలకు ఒకప్పుడు గొడవ ఇక్కడే మొదలైంది. అందుకే కుకీల ప్రతిపాదనలను నాగాలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇక నాగాలు కుకీ ప్రాంతాలను కూడా కలుపుకొని దక్షిణ నాగాలాండ్ ఏర్పాటు కోసం ఆందోళనలు మొదలుపెట్టారు. రెండు తెగల మధ్య 1990ల్లో మొదలైన హింసకు వందల మందీ చనిపోయారు. వందల గ్రామాలు విధ్వంసమూ అయ్యాయి. వేల ఇళ్లు దగ్ధమూ అయ్యాయి. స్త్రీలపై లెక్కలేనన్ని అత్యాచారాలూ జరిగాయి. నాగాలు కూడా పలు ప్రాంతాలు తమవేనని చెప్పటానికి సంప్రదాయ గాథలపైనే ఆధారపడతారు. కుకీలు, నాగాల ప్రతిపాదన ఏదైనా మెయిటీలు ససేమిరా అంటారు. మొత్తం మీద మణిపూర్ సంఘర్షణలకు భూములపై ఆధిపత్యం, హక్కులే ప్రధాన కారణాలుగా కనపడతాయి. ఆధునిక ఆర్థిక వ్యవస్థ అందించే ఉపాధి అవకాశాలు అంతగా లభించని కుకీలు, నాగాలకు ఉన్న భూములతో పాటు ఊహల్లో ఉన్న భూములను రక్షించుకోవటం అస్తిత్వ సమస్యగా మారిపోయింది. అందుకే ఈశాన్య భారత సంఘర్షణల్లో 50 శాతం మణిపూర్‌లోనే జరిగాయన్న లెక్కలను పూర్తిగా కొట్టేయలేం. ఆందోళన చేస్తున్న వాళ్లని బయటి వాళ్లుగా ముద్రవేయటం సులభం. తెగలకు కుదురు తక్కువ. అనువైన భూముల వైపు అడుగులు వేయటమే వారికి వ్యాపకం. మనం ఘనంగా చెప్పుకొనే అహోం రాజ పాలకులూ వెలుపల నుంచే వచ్చారు. మత, తెగ తత్వాలను తెగేదాకా లాగితే ప్రజాస్వామ్యానికే ప్రమాదం! అధిక సంఖ్యాక మతతత్వమూ దాన్ని రక్షించలేదు. మణిపూర్ నేర్పే పాఠమదే!

## మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ను

# సన్మానించిన పంజాల రాజు



సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పంజాల రాజు, గాడి పల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ కు శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేశారు ఈ సందర్భంగా పంజాల రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ యువ నాయకుడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి కి అలాగే వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ కు శాలువాతో సత్కరించి, సర్దార్ ఖాన్ కు, జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగిందని సర్దార్ ఖాన్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో నాయకులు గంగిశెట్టి రాజు, అగ్గర్, మల్లారెడ్డి, అజీమ్, లక్ష్మణ్ నర్సారెడ్డి, శ్రవణ్ రాజశేఖర్ రెడ్డి, శశి, దప్పు గణేష్, తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్ నగరంలో లాపిస్ టెక్నాలజీస్

# బిజినెస్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం



కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్ 12 : లాపిస్ టెక్నాలజీస్ తన బిజినెస్ ఇన్నోవేషన్ సెంటర్‌ను తాడ్ బండ్ హనుమాన్ టెంపుల్ సమీపంలో కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైంది. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ సహకారంతో రూపొందించిన ఈ కేంద్రం.. ఎల్‌జీ విస్తృత శ్రేణి ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే ఉత్పత్తులు, సిస్టమ్ ఏసీలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బి2బి ఐడి సొల్యూషన్స్ హెడ్ హేమేందు సిన్హా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమేందు సిన్హా మాట్లాడుతూ...."మా విజయానికి భాగస్వాములు కీలకమని మేము విశ్వసిస్తున్నామని అన్నారు. లాపిస్ ఇన్నోవేషన్ సెంటర్ కేవలం ఉత్పత్తులు మాత్రమే కాదు- ఇది సమగ్ర పరిష్కారాలను అందిస్తుందని తెలిపారు. సూపర్ సైన్ సీఎంఎస్ (కంటెంట్ మేనేజ్ మెంట్ సాఫ్ట్ వేర్) మా యాజమాన్య సాఫ్ట్ వేర్, వ్యాపారాలు తమ ఎల్‌జీ డిస్ ప్లేల అంతటా కంటెంట్ ను నిర్వహించడానికి, షెడ్యూల్ చేయడానికి అనుమతిస్తుందని అన్నారు. ఒకే పాయింట్ నుంచి అనేక పరికరాలను నియంత్రించాల్సిన వ్యాపారాలకు ఇది అనువైనది, కంటెంట్ వివిధ ప్రదేశాలలో నిరాటంకంగా ఉపయోగించవచ్చునని పేర్కొన్నారు. ఏ సమస్యలైనా వ్యాపార కార్యకలాపాలను ప్రభావితం చేయడానికి ముందే గుర్తించి, పరిష్కరిస్తుందని వెల్లడించారు.

# డైరెక్టర్ రోషి రెడ్డి దంపతులకు ఘన సన్మానం



సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో గురువారం లయన్స్ క్లబ్ స్నేహ ఆధ్వర్యంలో ప్రముఖ డైరెక్టర్ రోషి రెడ్డి దంపతులను శాలువాతో ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా లయన్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రముఖ డైరెక్టర్ రోషి రెడ్డి పెళ్లిరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో రోషి రెడ్డి దంపతులకు చిరు సన్మానం చేసి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని రోషి రెడ్డి స్వయంకృషితో ఎదిగి సినీ రంగంలో ప్రముఖ డైరెక్టర్ గా ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న రోషి రెడ్డికి సినీ రంగంలో మంచి భవిష్యత్తు ఉందని రాబోయే రోజుల్లో మరిన్ని మంచి చిత్రాలు నిర్మించి గజ్వేల్ పేరును విశ్వవ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు తెలిపారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు లయన్ మల్లేశం గౌడ్, లయన్ దొంతుల సత్యనారాయణ, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు అయిత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ కంచరకుంట్ల రామిరెడ్డి స్వామి వారి స్వగృహంలో


## శ్రీ అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ



యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో కంచరకుంట్ల కాలనీలో శ్రీ వెంకట్ రెడ్డి గురుస్వామి మరియు వారి కుమారుడు శ్రీ కంచరకుంట్ల రామిరెడ్డి స్వామి వారి స్వగృహంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ కార్యక్రమం శ్రీ బొబ్బిళ్ళ మురళీ గురుస్వామి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి వారికి పంచామృతాభిషేకము సహస్రనామ స్తోత్రం అయ్యప్ప స్వామి అష్టోత్తరము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేలాదిమంది అయ్యప్ప భక్తులు భక్తులు పాల్గొన్నారు పూజా కార్యక్రమంలో గురు స్వాములు తూర్పాటి శంకర్ గురు స్వామి కామిశెట్టిభాస్కర్ గురుస్వామి, నామిరెడ్డి ధర్మారెడ్డి స్వామి, మరియు చౌటుప్పల పట్టణ గురు స్వాములు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకూరి ప్రభాకర్ రెడ్డి రాజు గౌడ్ ఆకుల ఇంద్రసేనారెడ్డి సుర్వినరసింహ గౌడ్, బోయ దేవేందర్, ముగుదాల రమేష్ గౌడ్, గూడూరు జయపాల్ రెడ్డి, పెద్ద గౌని రమేష్ గౌడ్, చౌటుప్పల్ పట్టణ మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు... ఈ సందర్భంగా గురుస్వామి బొబ్బిళ్ళమురళి మాట్లాడుతూ అయ్యప్ప భక్తులందరూ ఈ యొక్క దీక్ష కాలంలో గురు స్వాములు చెప్పిన విధంగా దీక్షా నియమాలు పాటించి శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం చేసుకోవాలని గురుస్వామి దారిలో నడిచి క్రమశిక్షణతో కూడిన భక్తులుగా మేలుగాలని కోరారు ఇట్లు.. కంచర కుంట్ల రామ్ రెడ్డి స్వామి చౌటుప్పల్... ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప...

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**డిసిసి ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్**




శాలిగౌరారం మండలం జాలోనిగూడెం గ్రామానికి చెందిన ముద్దం పవిత్రకు తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మందుల సామేల్ నేతృత్వంలో 38 వేల రూపాయల విలువగల సీఎం సహాయనిధి చెక్కు మంజూరు అయింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్ గురువారం మండల కేంద్రంలో అందజేశారు. సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ యంపిటీసి నోముల జనార్దన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేష్, జాలోనిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు బంటు బీరప్ప, రామగిరి గ్రామ శాఖ అధ్యక్షులు మొగుల్ల శ్రీను, మండల నాయకులు కదారి అంజయ్య, కూతాటి సోమయ్య, ఎల్లంకి సైదులు, మంగదుడ్ల శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్

**మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్**



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ ములుగు మండలం మాధవరావు పల్లి గ్రామానికి చెందిన బాధవత్ నవత - నాగరాజు కూతురు అనుష అర్జున్ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్కీ, రామనాకర్, యూత్ నాయకులు గూడేపు రాకేష్, జిల్లా నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## హై స్కూల్ ముందంజలో ఉన్నా బెల్ట్ షాపుల పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ ఏటూరునాగారం : డిసెంబర్ 12. ఏటూర్ నాగారం:-పాఠశాలల్లో చుట్టుపక్కల ఉన్నటువంటి దుకాణములు, బెల్ట్ షాపులు పై దృష్టి పెట్టాలని మండల కమిటీ విద్యాధికారికి(%వీజుూ%) కు వినతిపత్రం అందజేశారు. భారత విద్యార్థి ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ కార్యదర్శి రవితేజ మాట్లాడుతూ హైస్కూల్ ఏటూర్ నాగారం మండల కేంద్రంలో ఉన్నటువంటి పాఠశాల చుట్టూ షాపులు, బెల్ట్ షాపులు ఉండటం వల్ల విద్యార్థులు మద్యం, సిగరెట్టుకు బానిస అవుతారని వారన్నారు. అదేవిధంగా పేద మధ్యతరగతి విద్యార్థులు స్కూల్ టైం లో హాస్టల్ లో ఉన్న సమయంలో ఆ యొక్క షాప్ కు వెళ్లి మద్యం సిగరెట్ వంటి వ్యవస్థకు ఆకర్షితులు అవుతారని ముందు జాగ్రత్త వహిస్తూ వారు అన్నారు. దీనిపై మండల విద్యాధికారికి వినతి పత్రం అందించడం జరిగింది. దీనిపై చర్య తీసుకోవాలని వారు తెలియజేశారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోగిల బాలేశ్వర్, కుమ్మరి నర్సింగరావు, స్వామి, గణేష్ పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన వంటి అంశాలపై పనిచేస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ నిర్మాణ్

**- సోషల్ ఇంపాక్ట్ కాన్ క్లేవ్ 4. కి ముఖ్య అతిథిగా హాజరు అయిన మంత్రి సీతక్క**




ములుగు, తెలంగాణ సేన న్యూస్ : వన్ కార్పొరేట్-వన్ విలేజ్ నినాదంతో ములుగు జిల్లాలో ఏడు గ్రామాలను కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు దత్తత తీసుకున్నాయి. ములుగు లోని చంద్రు తండా, ఎల్బీనగర్, జవతారపల్లి, ఇంచన్ చెరువుపల్లి గ్రామాలను దత్తత తీసుకున్నాయి పలు కార్పొరేట్ సంస్థలు. కార్పొరేట్లకు, ప్రభుత్వానికి మధ్య వారధి లాగా పనిచేస్తున్న నిర్మాణ్ సంస్థకు, టీంకి అభినందనలు తెలిపారు మంత్రి సీతక్క. కష్టాన్ని ఇష్టంతో చేస్తే మంచి ఫలితాలు వస్తాయి అనడానికి నిర్మాణ్ సంస్థ నిదర్శనం అని, మార్గంలో ప్రాంతాల్లోకి వెళ్లి పనిచేస్తే ఆ సంతోషంలో వేరు. కార్పొరేట్ సంస్థలు పల్లె ప్రాంతాల అభివృద్ధి కోసం పనిచేయాలని, మారుమూల ప్రాంతాల్లోని పరిస్థితులను గ్రామీణ బస్సు యాత్ర ద్వారా కార్పొరేట్లకు చూపించగలరు అని మంత్రి సీతక్క ఈ కార్యక్రమంలొ పాల్గొని మాట్లాడారు. ఇంకా ఇంటర్నెట్ సౌకర్యం లేని గ్రామాలు వున్నాయని, మీరు గ్రామాల అభివృద్ధి కోసం ముందుకు రావడం అభినందనీయం అని పేర్కొన్నారు. వన్ కార్పొరేట్.. వన్ విలేజ్ అడాప్షన్ చాలా గొప్ప నిర్ణయం. మీరు గ్రామాల్లో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాలి. మీ బాటలో ఎంతోమంది ముందుకు వచ్చి గ్రామాలను దత్తత తీసుకుంటాయి ప్రజల అభివృద్ధి కోసం మనసున్న మార్గం తెలియదు. ఆ మార్గాన్ని ప్రభుత్వ ప్రతినిధులుగా మేము చూయిస్తాం అని, అట్టడుగు స్థాయి ప్రజల అవసరాలు తీర్చగలిగేలా ప్రణాళిక బద్దంగా పనిచేయండి అని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం మా ప్రభుత్వం పాటుపడుతుంది. 17 రకాల వ్యాపారల్లో మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నఓ. సోలార్ విద్యుత్ ప్లాంట్లను, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళలకు కేటాయిస్తున్నాం. ఎన్నో వ్యాపారాల్లో మహిళలను ప్రోత్సహించి లక్ష అధికారులను చేస్తున్నాం అని, కుటుంబంలో తల్లి బాగుంటేనే కుటుంబం బాగుంటుంది అన్నారు. 64 లక్షల మంది సభ్యులుగా ఉన్న మహిళా బృందాలను కోటి మందికి చేర్చడమే మా లక్ష్యం. వారికి బ్యాంకుల ద్వారా వేలకోట్ల వడ్డీ లేని రుణాలు కనిపిస్తున్నాను. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం వృద్ధి చెందుతుంది. గ్రామాల్లో సాంకేతిక వెనకబాటు ను రూపుమాపే దిశలో ఐటి సంస్థలు పనిచేయాలి. సమాజం లో అసమానతలు తగ్గించే దిశలో కార్పొరేటర్ సంస్థ లు కృషి చేయాలి. ఏజెన్సీ, వెనుకబడిన మారుమూల గ్రామాలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చిన అందరికీ అభినందనలు గ్రామాల్లో మార్పు చేసి చూపించాలి. మార్పు ఆకాంక్షిస్తున్న సంస్థలకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుంది అని మంత్రి సీతక్క అన్నారు.

# రాజకీయాలకి అతీతంగా గ్రామ బొడ్రాయి పండగ జరుపుకుందాం

**మాజీ జడ్పీటీసీ పేరాల పులమ్మ**




నాగారం మండలం ఈటూరు గ్రామంలో రానున్న ఎండాకాలంలో నిర్వహించబోయే బొడ్రాయి పండగను రాజకీయాలకు అతీతంగా ఘనంగా నిర్వించుకుందామని తిరుమలగిరి మండలం మాజీ జడ్పీటీసీ పేరాల పూలమ్మ అన్నారు. సందర్భంగా గురువారం ఈటూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పేరాల పులమ్మా మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రజలు ఎవ్వరూ కూడ గతంలో చేసిన పండగ చూడలేదని, సుమారు వందేళ్ళ క్రితం బొడ్రాయి పండగ నిర్వహించారని తెలిపారు. చాలా కాలం నుండి గ్రామ ప్రజలు అంత చాలా ఆసక్తిగా బొడ్రాయి పండగా కోసం ఎదురు చూస్తున్నారని, పండగకి గ్రామంలో యువజన సంఘాలు, ఉద్యోగస్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలంతా, సహకరించాలని, ఘర్షణలకు చోటు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ తొలగించిన ఆదర్శ రైతులను సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ధరించాలి

**ఆదర్శ రైతు రాష్ట్ర అధ్యక్షులు కసిరబోయిన లింగం యాదవ్**



శాలిగౌరారం, కాంగ్రెస్ ప్రభుత్వం 2007 లో ఏర్పాటు చేసిన ఆదర్శ రైతు వ్యవస్థను 2014 కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేయడం వల్ల 16 వేల కుటుంబాలు బజారున పడ్డాయాని తిరిగి సీఎం రేవంత్ రెడ్డి ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్దరణ చేసి ఆదుకోవాలని రాష్ట్ర ఆదర్శ రైతు సంఘం అధ్యక్షులు కసిరబోయిన లింగం యాదవ్ కోరారు. నల్గొండ జిల్లా శాలిగౌరారం లోని వ్యవసాయం మార్కెట్ యార్డ్ లో నకిరేకల్ డివిజన్ ఆదర్శ రైతు సమావేశం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్న లింగం యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తిరిగి ఆదర్శ రైతు వ్యవస్థ ను పునరుద్దరిస్తాని ఎన్నికల మేనిఫెస్టో లో హామీ ఇచ్చారన్నారు. ఇటీవల వ్యవసాయం శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ను తాము కలిసి నపుడు తిరిగి ఆదర్శ రైతులను తీసుకుంటామని చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఆదర్శ రైతులను ఇంకా విధుల్లోకి తీసుకోక పోవడం అన్యాయం మన్నారు. తమను విధుల్లోకి తీసుకుంటే రైతు సంక్షేమ పథకాలు అమలు చేయడం లో తాము ముందటమన్నారు. రైతు భరోసా, రైతు భీమా, డిజిటల్ క్రాప్ సర్వే తదితర విషయాల్లో మండల స్థాయి లో ని ఏవో లకు, ఏఈఓ ల కు సహాయ, సహకారం తో ఆదర్శ రైతు వ్యవస్థ పని చేస్తుందన్నారు. బజారున పడ్డ 16 వేల మంది ఆదర్శ రైతులను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విధుల్లోకి తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు మెదరమెట్ల కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బట్ట శివ బిక్షం, నకిరేకల్ డివిజన్ అధ్యక్షులు దొంతూరి శంకర్, నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి, శాలిగౌరారం మండల అధ్యక్షులు ఒంటెపాక భీమయ్య, గందమళ్ళ అంతయ్య, దుర్గం అంజయ్య, బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శులు అల్లి సైదులు, వేముల వెంకన్న, రంగు వీరయ్య, చనగాని లింగయ్య పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి

- టీఎస్ జేయు డిమాండ్...
- సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన టీఎస్ జేయు బృందం..
- చిన్న పత్రికల ఎంపానెల్మెంట్ వెంటనే చెపట్టాలి..
- జర్నలిస్ట్ పెన్షన్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి..




ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్: ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న పాత్రికేయుల కోసం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో అమలు చేస్తున్నట్లుగా జర్నలిస్టు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని టీఎస్జేయు రాష్ట్ర కమిటీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసింది. అలాగే 10 లక్షల రూపాయల ఉచిత జీవిత బీమా సదుపాయం కల్పించాలని టీఎస్ జేయు నాయకత్వం మంత్రిని కోరింది. అక్రిడేషన్ల కమిటీలు పునరుద్ధరణ చేసి జర్నలిస్ట్ లందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలనికోరారు. అక్రిడేషన్లతో సంబంధం లేకుండా జర్నలిస్ట్ సంక్షేమ పథకాలను జర్నలిస్టుల అందరికీ అందేలా చూడాలని కమిటీ కోరింది. రాబోయే అక్రిడేషన్ కమిటీలలో అన్ని జర్నలిస్టు సంఘాలకు భాగస్వామ్యం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తోకల, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాజ్ పటేల్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు క్రాంతి కుమార్ అశోక్ తదితరులు ఉన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. చిన్న పత్రికలను తక్షణమే ఎమ్పానెల్మెంట్‌లో చేయాలి
2. సంక్షేమ పథకాలలో యూనియన్ల జోక్యం లేకుండా చూడాలి జర్నలిస్టుల సంక్షేమ పథకాలు నేరుగా అమలు చేయాలని, యూనియన్ల జోక్యం లేకుండా వ్యవస్థను మెరుగుపరచాలి.
3. మీడియా రంగానికి ప్రత్యేక పాలసీ రూపొందించి, జర్నలిస్టుల భద్రత, పత్రికా స్వేచ్ఛకు పూర్తి రక్షణ కల్పించాలి.
4. మీడియా ఉద్యోగుల సంక్షేమం జర్నలిస్టుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన బీమా, పెన్షన్, మరియు ఇతర ఆర్థిక సహాయ కార్యక్రమాలను విస్తరించాలన్నారు.

# మెగా హెల్త్ క్యాంప్ రోటరి క్లబ్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ ఏటూరునాగారం : డిసెంబర్ 12. ఏటూరు నాగారం మండల కేంద్రంలో గల శంకరాజూపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గత తేదీ. 24.11. 2024 ఆదివారం రోజున క్యాంపు నిర్వహించడం జరిగింది. అనంతరం ఆ క్యాంపులో కంటికి సంబంధించిన కళ్లద్దాలను సొంత డబ్బులతో అర్హులైన 150 పేషెంట్లకు తయారుచేసి తేదీ. 12. 12. 2024 గురువారం రోజున రోటరి క్లబ్ మెంబర్స్ అయినా కాకులమర్రి లక్ష్మణ్ బాబు, ప్రదీప్ రావు ఆధ్వర్యంలో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, మాజీ ఎంపీపీ అంతటి విజయ, ఎండి ఖజా పాషా, కుమ్మరి చంద్రబాబు, కాళ్ల రామకృష్ణ, కాకుల మర్రి భాస్కరరావు, బాస పుల్లయ్య ఖలీల్, చిప్ప నాగరాజు, ఎర్రల సారయ్య, మరియూ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సేన



# బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా..

# తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్:** బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నాం ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని చెనప్పారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని వెల్లడించారు. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం సాకు చూపిస్తున్నదని విమర్శించారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కావడానికి అవసరమైన మరో 100 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చేందుకు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కేసీఆర్ మాట్లాడారని చెప్పారు. బీజేపీకి తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి, ప్రేమ ఉన్నా



తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కాదని పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం బాధాకరమన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్కరు కూడా స్పందించకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఉక్కు పరిశ్రమ కోసం డిమాండ్ చేశారని, ఇప్పుడు మాత్రం మాట్లాడటం లేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయించాలన్నారు.

**కష్టాల కడలిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు: ఎమ్మెల్సీ కవిత**

**హైదరాబాద్:** విద్యాలయాల్లో వసతులు కల్పించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కష్టాల కడలిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలు కొట్టుమిట్టాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులు దుప్పట్లు లేక చలికి వణికిపోతూ నేలపైనే నిద్రిస్తున్నారని, చన్నీటితో స్నానం చేస్తున్నారన్నారు. ఇది ప్రభుత్వ చేతగానితనానికి, అసమర్ధతకు నిదర్శనమని మండిపడ్డారు. కేవలం జగిత్యాల జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఇదే రకమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. ఆడబిడ్డలు చదువుతున్న పాఠశాల్లో అన్ని వసతులు కల్పించాలని, తగిన విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో తొమ్మిది మంది విద్యార్థినులు అస్వస్థత చెందగా, అందులో ముగ్గురిని స్థానిక దవాఖానకు, మరో ఆరుగురిని జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం కోలుకోవడంతో సాయంత్రం ఇండ్లకు పంపించిన విషయం తెలిసిందే. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. దీంతో 15 మంది విద్యార్థినులు దవాఖానలో చేరారు.

# సౌందర్య బంగ్లా చుట్టూనే మంచు వారి లొల్లి

**హైదరాబాద్ :** మంచు మనోజు కుటుంబలో ఆస్తుల చిచ్చి రచ్చకెక్కింది. గతంలో ఇంట్లోనే ఉన్న ఈ వివాదాలు ఇప్పుడు వీధికెక్కాయి. ముఖ్యంగా మంచు మనోజ్, మోహన్ బాబు లమధ్య ఈ వివాదం తారాస్థాయికి చేరుకుంది.టాలీవుడ్ ఇండస్ట్రీలో మోహన్ బాబకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎన్నో సినిమాల్లో నటించిన ఆయన రియల్ లైఫ్ లోనూ రాజకీయాల్లో ప్రవేశించారు. పలు సందర్భాల్లో మోహన్ బాబు తన ఫ్యామిలీ గురించి గొప్పగా చెప్పుకునేవారు. తమ కుటుంబం క్రమశిక్షణకు మారుపేరు అనుకునేవారు. కానీ ఇప్పుడు ఆయన కుమారుడు మంచు మనోజ్ తో గొడవలు రావడంతో ఆయన దీనిని తీవ్ర అవమానంగా ఫీలవుతున్నారు. తాజాగా మోహన్ బాబు నివాసం ఉంటున్న వద్దకు మంచు మనోజ్ బౌన్సర్లతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో మోహన్ బాబు నియంత్రణ కోల్పోయి మీడియాపై దాడి చేయడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో అసలు గొడవ ఎందుకు జరుగుతోంది? దేని కోసం మోహన్ బాబు, మంచు మనోజ్ మధ్య వాగ్వాదం ఏర్పడుతుంది? అనే వివరాల్లోకి వెళితే..మంచు మనోజు కుటుంబలో ఆస్తుల చిచ్చి రచ్చకెక్కింది. గతంలో ఇంట్లోనే ఉన్న ఈ వివాదాలు ఇప్పుడు వీధికెక్కాయి. ముఖ్యంగా మంచు మనోజ్, మోహన్ బాబు లమధ్య ఈ వివాదం తారాస్థాయికి చేరుకుంది. ప్రస్తుతం మోహన్ బాబు శంషాబాద్ శివారులోని జల్ పల్లిలోని ఓ లగ్జరీ ఫాంహౌజ్ లో ఉంటున్నారు. అయితే ఈ వివాదం అంతా ఈ బంగ్లా చుట్టేనని అర్థమవుతోంది. మోహన్ బాబుకు చెందిన ఇది తనకే కావాలని మంచు మనోజ్ పట్టుబడుదుతున్నాడు. కానీ అలా కుదరదని మోహన్ బాబు అంటున్నాడు.అయితే ఈ బంగ్లా గురించి తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఎందుకంటే ఇది దివంగత నటి సౌందర్యకు చెందినది. ఆమెకు చెందిన దీనిని మోహన్ బాబు సొంతం చేసుకున్నారు. సౌందర్య చనిపోయిన తరువాత ఆమె కుటుంబ సభ్యులు దీనిని మోహన్ బాబుకు విక్రయించారని కొందరు చెబుతున్నారు. కానీ అక్రమంగా తీసుకున్నారని మరికొందరు వాదిస్తున్నారు. కానీ నిజమేంటో తెలియాల్సి ఉంది. అయితే ఈ ఫాం హస్ విలువ రూ.100 కోట్లు ఉంటుందని సమాచారం. అంతేకాకుండా ఇది లగ్జరీ లెవల్లో ఉండడంతో దీనిని సొంతం చేసుకోవాలని మంచ మనోజ్ పట్టుబడుతున్నాడు.కానీ మోహన్ బాబు మాత్రం తనకున్న ముగ్గురి సంతానానికి సమానంగా ఆస్తులు ప్రకటిస్తానని చెప్పారు. మోహన్ బాబుకు విష్ణుతో పాటు మనోజ్ కుమారులు ఉండుగా కూతురు లక్ష్మీ ఉన్నారు. అయితే ఈ గొడవ ఎక్కువగా మంచు మనోజ్, మోహన్ బాబు మధ్యే ఎక్కువగా సాగుతోంది. ఈ విషయంలో ఎవరికి వారే తమదే న్యాయం అని అంటున్నారు. అయితే తాజాగా జరిగిన గొడవలో మోహన్ బాబు మీడియా ప్రతినిధులపై దాడి చేయడం కలకలం రేపుతోంది. విషయంలో మంచు ఫ్యామిలీ మొత్తానికి నోటీసులు అందినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా మోహన్ బాబు తాజాగా మనోజ్ ను ఉద్దేశించి ఓ ఆడియోను రిలీజ్ చేశారు. కేవలం ఆస్తి కోసం తన పరువు తీస్తున్నావని మనోజ్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వల్ల తల్లి ఆసుప్రతి పాలైందని, ఎవరో చెప్పిన మాటలు విని తండ్రిపై దాడి చేయడం తగదని అన్నారు. ఇక మీడియా ప్రతినిధులపై దాడి చేయడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని కొందరు ఆందోళన చేస్తున్నారు

# కాంగ్రెస్‌ను చంపేస్తారా..

# జాతీయ నాయకులపై జగ్గారెడ్డి ఫైర్

కాంగ్రెస్ జాతీయ నాయకులపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ నాయకుల తీరుపై ఆయన మండిపడ్డారు. ఏఐసీసీ కార్యదర్శి విష్ణుతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ వ్యవహారం సరిగ్గా లేదని జగ్గారెడ్డి తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను చంపేస్తారా అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ రాష్ట్రంలో ఉన్నారా.. వేరే రాష్ట్రానికి వెళ్లిపోయారా అని ప్రశ్నించారు. అధికార పార్టీ అంటే ఎలా ఉండాలి.. ఇలాగేనా అధికార పార్టీ ఉండే తీరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఏం చేస్తున్నారో మీకైనా అర్థమవుతోందా అని మండిపడ్డారు. తెలంగాణలో నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవుల కేటాయింపుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కీలక నేతలైన తమకు తెలియకుండా నియామకాలు జరుగుతుండటంపై జగ్గారెడ్డి ఫైర్ అయినట్లు తెలుస్తోంది.

**పదవుల పంపకంపై..**

పార్టీలో పదవులు, ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులకు సంబంధించి స్థానిక నేతలకు సరైన సమాచారం ఉండకపోవడంపై జగ్గారెడ్డి ఏఐసీసీ నేతలపై ఆగ్రహం వ్యక్తం



చేశారు. తమతో ఎలాంటి చర్చలు జరపకుండానే పేర్లు ప్రకటిస్తున్నారని జగ్గారెడ్డి తెలిపారు. తమకు తెలియకుండా కొత్తవారిని పదవుల కోసం సిఫార్సు చేస్తున్నారని, అధిష్టానం ఫైనల్ చేసిన తర్వాత తమకు తెలుస్తోందన్నారు. ఇలాచేస్తే కాంగ్రెస్ పార్టీ మనుగడ తెలంగాణ కష్టమవుతుందన్నారు. తెలంగాణలో పార్టీని చంపేయాలనే లక్ష్యంతో కొందరు నేతలు పనిచేస్తున్నట్లు ఆరోపించారు. ఏఐసీసీ నేతలపై జగ్గారెడ్డి వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. జగ్గారెడ్డికి ఆగ్రహం తెప్పించేలా ఎలాంటి నియామకాలు చేపట్టారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. గతంలోనూ పార్టీలో కొందరు నాయకుల తీరుపై జగ్గారెడ్డి బహిరంగంగా విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని బహిరంగంగానే జగ్గారెడ్డి చెబుతుంటారు. దీనిలో భాగంగా ఏఐసీసీ నేతలపై జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనంగా మారాయి.

**ముక్కుసూటిగా**

ఏ విషయానైన్నా జగ్గారెడ్డి ముక్కుసూటిగా చెబుతారనే పేరుంది. సొంత పార్టీ నేతలపై అప్పుడప్పుడు జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు. అవతలివారి స్థాయిని పక్కనపెట్టి మరీ విమర్శలు చేస్తుంటారు. పార్టీపై విపక్షాలు విమర్శలు గుప్పించినా ధీటుగా సమాధానం ఇస్తుంటారు. ప్రస్తుతం సొంత పార్టీ నేతలపైనే ఆయన విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల నియామకంలో ఎప్పటినుంచో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్నవారికి దక్కడం లేదదంటూ జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ తమ పనితీరు మార్చుకోవాలని జగ్గారెడ్డి హితవు పలికారు.

# లగచర్ల రైతుకు బేడీపై సీఎం రేవంత్ సీరియస్

-మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల, పోలేపల్లిలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై గ్రామస్తులు దాడికి పాల్పడం సంచలనంగా మారింది. ఈ ఘటనలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ప్రధాన నిందితుడు సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అలాగే కలెక్టర్‌పై దాడికి పాల్పడిన కొందరు లగచర్ల రైతులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో రైతు హీర్యానాయక్ ఒకరు. ఈ రైతు ప్రస్తుతం కంది సెంట్రల్ జైలులో ఉన్నాడు. అయితే గత రాత్రి(బుధవారం) హీర్యాకు ఛాతిలో నొప్పి రావడంతో అతడిని జైలు అధికారులు సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈరోజు కూడా మరోసారి వైద్య పరీక్షల నిమిత్తం హీర్యానాయక్‌ను సంగారెడ్డి జనరల్ ఆస్పత్రికి జైలు అధికారులు తీసుకొచ్చారు. అయితే ఆస్పత్రికి



తీసుకువస్తున్న సమయంలో హీర్యా నాయక్ చేతికి బేడీలు ఉన్నాయి. బేడీలతోనే హీర్యానాయక్‌ను పోలీసులు సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకొచ్చారు. అంతేకాకుండా బేడీలతో రైతుకు చికిత్స అందజేశారు. ఇప్పుడు ఇది రచ్చకు దారి తీసింది. రైతును బేడీలతో ఎలా తీసుకువస్తారంటూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బేడీల అంశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి చేరడంతో సీఎం సీరియస్ అయ్యారు. వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**హీర్యా నాయక్ ఆరోగ్య పరిస్థితిపై**

హీర్యా నాయక్ ఆరోగ్య పరిస్థితిపై సంగారెడ్డి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్ మీడియాతో మాట్లాడుతూ.. హిర్యనాయక్‌కి రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కంది జైల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు రాత్రే ఈసీజీ తీశాం నార్మల్‌గా ఉందని అన్నారు. ఈరోజు ఉదయం మళ్లీ కొన్ని చెక్ అప్‌ల కోసం ఆస్పత్రికి రమ్మని చెప్పమన్నారు. ఉదయం కూడా 2డీ ఈకో, ఈసీజీతో పాటు మిగతా కొన్ని పరీక్షలు చేశామని.. అన్ని నార్మల్‌గానే ఉన్నాయన్నారు. కార్డియాక్‌వలుషేన్ కోసం గాంధీకి రెఫర్ చేశామని.. ప్రస్తుతం వీర్యనాయక్ స్టేబుల్ గానే ఉన్నారని చెప్పారు.. అయిన కూడా సేఫ్ సైడ్ కోసం, కార్డియాలజిస్ట్ ఒపీనియన్ కోసం గాంధీకి రిఫర్ చేశామని అన్నారు. ఇప్పటి వరకు తాము చేసిన ఈసీజీ,2డీ ఈకో టెస్టులో అన్ని నార్మల్ గానే ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్ తెలిపారు.

## ఉద్యోగుల సమయపాలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

-మొదటిపేజీ తరువాయి

ఫేషియల్ రికగ్నేషన్ విధానంపైనే రోజువారి అటెండెన్స్ నమోదు చేయనున్నారు. గురువారం నుంచి అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఇది వర్తిస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో ప్రధానంగా రాష్ట్ర సచివాలయం పాలన విభాగానికి గుండెకాయ లాంటిది. అయితే కొంత మంది ఉద్యోగులు సమయానికి రావడంలేదని, ఇష్టానుసారంగా వస్తున్నారని, 12 గంటల వరకు కూడా కొంతమంది రావడం లేదని.. ఒక వేళ వచ్చినా.. సాయంత్రం 5 గంటలలోపే తిరిగి వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్.. మంత్రులు కొందరు తమ శాఖల్లోని ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉద్యోగులు సమయానికి రావడంలేదని తేలింది. అలా రాని ఉద్యోగుల నుంచి వివరణ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ అమలులోకి తీసుకువచ్చింది. ఉద్యోగుల సమయపాలన సెక్రటేరియట్ భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్ అమలు నిర్ణయం తీసుకుంది.

## రైతు హీర్యా నాయక్ ఉగ్రవాదా..?

## లేక దోపిడీ దొంగనా..

**సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు**

దేశానికి అన్నం పెట్టే రైతన్న చేతికి బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న లగచర్ల రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకువెళ్లడం హేయమైన చర్య అని



మండిపడ్డారు. ఇంత కంటే దారుణం ఏముంటుందని ప్రశ్నించారు. రైతు హీర్యా నాయక్ ఉగ్రవాదా..? లేక దోపిడీ దొంగనా అని నిలదీశారు. రైతుల పట్ల ఎందుకు ఇంత కర్కశంగా వ్యవహరిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. వాళ్ళ భూములు గుంజుకుంటారు.. తిరగబడితే అరెస్టులు చేస్తారు.. వాళ్ళను ఉగ్రవాదులుగా భావిస్తూ అత్యంత క్రూరంగా వ్యవహరిస్తారని విమర్శించారు. ఇదేనా మీ ఇందిరమ్మ రాజ్యం. ఇదేనా మీ ప్రజాపాలన అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ముమ్మాటికి మీది ప్రజా కంటక పాలన.. రైతు కంటక పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రేవంత్ రెడ్డి క్రూర మనస్తత్వానికి నిదర్శనం : కేటీఆర్**

గుండె నొప్పి వచ్చిన రైతన్నకు సంకెళ్లు వేయడం దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి క్రూర మనస్తత్వానికి నిదర్శనమని ఆరోపించారు. హీర్యా నాయక్ కి గుండెల్లో నొప్పి వస్తే వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబ సభ్యులకు, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. సకాలంలో ఆసుపత్రికి తరలించకుండా అమానవీయంగా వ్యవహరించిందని విమర్శించారు.

గురువారం ఉదయం రెండోసారి మళ్లీ గుండెపోటు రావడంతో అతడిని సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకువెళ్లారని పేర్కొన్నారు. ఆయనతో పాటు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం కూడా తీవ్రమైన ఇబ్బందుల్లో ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. నాయకుడు పట్నం నరేందర్ రెడ్డి కి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయని వెల్లడించారు. గుండెపోటు వచ్చిన రైతుకు ప్రభుత్వం స్ట్రెచర్ మీదనో, అంబులెన్స్ మీదనో తీసుకురావాల్సి ఉండగా బేడీలు వేసి తీసుకురావడం శోచనీయమని అన్నారు. రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమే నని స్పష్టం చేశారు. నూతన క్రిమినల్ చట్టం బిఎన్‌ఎస్‌ఎస్ ప్రకారం కూడా, పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం అండర్ ట్రయల్స్ ఖైదీల హక్కులను హరించడమేనని వెల్లడించారు

## మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్‌దే నిర్ణయం

-మొదటిపేజీ తరువాయి

ప్రజాస్వామ్యం అంటే ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుందని చెప్పారు. హైడ్రాకు ధనిక, పేద అన్న తేడా లేదని స్పష్టం చేశారు. ఎవరు చెరువులను ఆక్రమించిన వారిపై హైడ్రా చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో



25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. రైతు భరోసాను సంక్రాంతి నుంచి అమలుచేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించామని అన్నారు. రైతులకు ఇచ్చే బోనస్‌లో రైతు భరోసా, రుణమాఫీ కన్నా ఎక్కువ లబ్ధి రైతులకు చేకూర్చుతుందని మల్లు భట్టి విక్రమార్క వివరించారు.

తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదని గుర్తుచేశారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరగాలన్న నిబంధన లేదని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీ రూల్స్ మార్చారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అప్పులకు 11 నెలల్లో రూ.64 వేల కోట్ల అసలు వడ్డీ కట్టామని తెలిపారు. రాష్టం ఏర్పడే నాటికి ఏడాదికి రూ.6400 కోట్లు ఉంటే ఇప్పుడు ఏడాదికే రూ.64 వేల కోట్లు కట్టాల్సి వచ్చిందనిమల్లు భట్టి విక్రమార్కతెలిపారు. తమ ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టింది అందుకే ప్రచారంలో వెనుకబడ్డమని అన్నారు. పదేళ్ల తర్వాత హాస్టళ్లకు ఇచ్చే డైట్ చార్జీలు పెంచామని తెలిపారు. డిసెంబర్ 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్‌లో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తామని ప్రకటించారు. కేసీఆర్ పాలన కంటే మెరుగైన పాలన తమ ప్రభుత్వంలో అందిస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## రాష్టాభివృద్ధికి సహకరించండి



-మొదటిపేజీ తరువాయి

మంత్రులకు వినతిపత్రాలు అందించనున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంపైన కేంద్ర పెద్దలతో చర్చించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి కేటాయించిన కోటా నిధులు మంజూరు చేయాలని కోరనున్నట్లు తెలుస్తోంది.

# లాన్ మస్క్ సరికొత్త రికార్డు..

## రాకెట్‌లా దూసుకుపోతున్న సంపద..!




ఎలాన్ మస్క్ రికార్డు సృష్టించాడు. 400 బిలియన్ డాలర్ల మొత్తం సంపదను కలిగి ఉన్న ప్రపంచంలోనే మొదటి వ్యక్తిగా ఎలోన్ మస్క్ నిలిచాడు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, SpaceX అంతర్గత వ్యాపార విక్రయాలతో ఎలాన్ మస్క్ నికర విలువలో 50 బిలియన్ డాలర్లు పెరిగాయి. దీంతో మస్క్ మొత్తం నికర విలువ 439 బిలియన్ డాలర్లకు పెరిగింది. డొనాల్డ్ ట్రంప్ విజయం తర్వాత, ఎలోన్ మస్క్ నికర విలువలో 175 బిలియన్ డాలర్లు పెరిగాయి. మరోవైపు టెస్లా షేర్లు కూడా మంచి పెరుగుదలను నమోదు చేశాయి. డిసెంబర్ 4 నుండి టెస్లా షేర్లు 72 శాతం కంటే ఎక్కువ పెరిగాయి. SpaceXకు పెట్టుబడిదారులు, కంపెనీ ఉద్యోగులు $1.25 బిలియన్ల విలువైన షేర్లను కొనుగోలు చేసేందుకు అంగీకరించినట్లు బ్లూమ్‌బెర్గ్ వెల్లడించింది.. ఈ డీల్ తర్వాత SpaceX విలువ 350 బిలియన్ డాలర్లుగా మారింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ స్టార్టప్‌గా అవతరించింది. ఈ ఒప్పందంతో ఎలాన్ మస్క్ నికర విలువలో 50 బిలియన్ డాలర్లు పెరిగాయి.దీంతో మస్క్ మొత్తం నికర విలువ 439.2 బిలియన్ డాలర్లకు పెరిగింది. అయితే అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలిచిన తర్వాత ఎలాన్ మస్క్ సంపద పెరుగుదల మరింత పెరిగింది. నవంబర్ 5న ఎలోన్ మస్క్ నికర విలువ 264 బిలియన్ డాలర్లు ఉండగా, ఇప్పుడు అతని నికర విలువ 439 బిలియన్ డాలర్లు దాటింది. అంటే ఎలోన్ మస్క్ సంపద అతి తక్కువ సమయంలో 175 బిలియన్ డాలర్లు పెరిగింది. ప్రస్తుత సంవత్సరంలో 200 బిలియన్ డాలర్లకు పైగా పెరుగుదల కనిపించింది. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం జూలై 1, 2023న, ఎలోన్ మస్క్ నికర విలువ $126 బిలియన్లు ఉండగా, సుమారు ఒకటిన్నర సంవత్సరాలలో 3.48 రెట్లు అంటే 248 శాతం పెరుగుదల కనిపించింది. మరోవైపు టెస్లా షేర్లలో మంచి పెరుగుదల ఉంది. బుధవారం ట్రేడింగ్ సెషన్‌లో, టెస్లా షేర్లు 4.50 శాతానికి పైగా పెరిగాయి. గరిష్ట స్థాయి $ 420.40కి చేరుకుంది. టెస్లా షేర్లు నవంబర్ 4 నుండి మంచి పెరుగుదలను చూస్తున్నాయి. నవంబర్ 4న కంపెనీ షేర్ల విలువ 242.84 డాలర్లు ఉంది. ఇందులో ఇప్పటి వరకు 73 శాతానికి పైగా పెరుగుదల కనిపించింది. ఇప్పుడు ఎలోన్ మస్క్ ఏడాది ముగిసేలోపు $500 బిలియన్లపై దృష్టి పెట్టాడు. అక్కడికి చేరుకోవడానికి ఎలోన్ మస్క్‌కి 15 రోజుల కంటే ఎక్కువ సమయం ఉంది. $500 బిలియన్లు చేరుకోవడానికి ఎలోన్ మస్క్‌కి కేవలం 60 బిలియన్ డాలర్లు మాత్రమే అవసరం. అంటే 500 బిలియన్ డాలర్ల మార్కును చేరుకోవాలంటే, ఎలోన్ మస్క్ సంపద ప్రతిరోజూ 3.50 బిలియన్ డాలర్లకు పైగా పెరగాలి. నవంబర్ 5 నుండి ప్రతిరోజూ ఎలోన్ మస్క్ సంపదలో 4.73 బిలియన్ డాలర్ల పెరుగుదల ఉంది. కావున మస్క్ సులభంగా 500 బిలియన్ డాలర్లకు చేరుకుంటారు.




p5

బాధ్యతలు చేపట్టిన ఆర్బీఐ
గవర్నర్ సంజయ్ మల్హోత్రా

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారం (డిసెంబర్ 10)తో ముగిసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రాను నియమించారు. అయితే శక్తికాంతదాస్ పదవీ కాలం పొడిగిస్తారని భావించినప్పటికి అలాంటి ప్రకటన ఏమి రాలేదు. కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉర్జిత్ పటేల్ రాజీనామా తర్వాత సెంట్రల్ బ్యాంక్ బాధ్యతలను శక్తికాంతదాస్ చేపట్టారు. 2018లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా శక్తికాంత దాస్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన హయాంలో అనేక ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకున్నారు. అయితే ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అటువంటి పరిస్థితిలో సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ఆర్థిక సేవల రంగంలో అతని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. సంజయ్ మల్హోత్రా ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ కింద రాజస్థాన్ కేడర్ నుండి తన సేవను ప్రారంభించారు. సంజయ్ మల్హోత్రాకు ఆర్థిక సేవల రంగంలో అపారమైన అనుభవం ఉంది. అతను భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక సేవల



# బంగారం ముట్టుకుంటే షాకే

బంగారం ధరలు మళ్లీ ఊపందుకున్నాయి. తగ్గినట్లే కనిపించిన పసిడి మళ్లీ జోరందుకొని పరుగులు పెడుతోంది. ఇవాళ గోల్డ్ రేట్స్ ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం. బంగారం ధరలు మళ్లీ ఊపందుకున్నాయి. తగ్గినట్లే కనిపించిన పసిడి మళ్లీ జోరందుకొని పరుగులు పెడుతోంది. ఎవరి అంచనాలకు అందకుండా వడివడిగా దూసుకెళ్తోంది గోల్డ్. మరో ఆభరణం వెండిది కూడా దాదాపుగా ఇదే వరస. ఈ రెండూ మహిళలకు షాక్ ఇస్తున్నాయి. రెండ్రోజుల తేడాలోనే రేట్లు అమాంతం ఊపందుకున్నాయి. ధరల్లో భారీ పెరుగుదల నమోదవుతూ వస్తోంది. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా నగల వ్యాపారులు, స్టాకిస్టుల కొనుగోళ్ల పెరుగుదల వల్ల దేశ రాజధాని న్యూఢిల్లీలో బంగారం ధరలు రూ.80,000 మార్క్‌ను చేరుకున్నాయి. హైదరాబాద్‌లో గురువారం నాడు గోల్డ్ రేట్స్ చూసుకుంటే.. 24 క్యారెట్ల బంగారం తులం రూ.79,480 పలుకుతోంది. అదే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ.72,860గా ఉంది. గత రెండు, మూడు రోజుల నుంచి బంగారంతో పాటు వెండి ధరలు కూడా పెరుగుతూ పోతున్నాయి. వరుసగా మూడో రోజు రూ.1,450 పెరిగిన వెండి.. ఇవాళ కిలో రూ.96,300కి చేరింది. బంగారం-వెండి ధరల పెరుగుదలకు అమెరికాలో వడ్డీరేట్లు మరింత తగ్గుతాయనే అంచనాలు ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేట్ 2,700 డాలర్లకు చేరువైంది. కాగా, పసిడి పరుగుల వెనుక అంతర్జాతీయ స్థాయిలో పలు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు పుంజుకోవడం కూడా దోహదం చేస్తున్నట్టు ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. బులియన్ మార్కెట్ మళ్లీ జోరందుకుంది. పది గ్రాముల మేలిమి (24 కేరట్స్) పసిడి ధర బుధవారం ఢిల్లీలో రూ.620 పెరిగి రూ.80,400 వద్ద ముగిసింది. కిలో వెండి రూ.1,450 లాభంతో రూ.96,300కు చేరింది. గత నెల రోజుల్లో వెండి ధరలో భారీ పెరుగుదల ఇదే. దేశీయ మార్కెట్‌లో రిటైలర్లు, నగల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడం ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అమెరికాలో వడ్డీరేట్లు మరింత తగ్గుతాయనే అంచనాలూ ఇందుకు తోడయ్యాయి.

## జూబిలెంట్ భార్తియా గ్రూప్ చేతికి




భారత బాట్లింగ్ వ్యాపారం 'హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్'లో (హెచ్‌సీసీబీఎల్) 40 శాతం వాటాను జూబిలెంట్ భార్తియా గ్రూప్‌నకు విక్రయిస్తున్నట్లు అంతర్జాతీయ శీతల పానీయాల దిగ్గజం కోకా-కోలా బుధవారం ప్రకటించింది. డీల్ విలువను మాత్రం వెల్లడించలేదు. అయితే, ఈ ఒప్పందం విలువ రూ.10,000 కోట్ల స్థాయిలో ఉండవచ్చని మార్కెట్ వర్గాల అంచనా. హెచ్‌సీసీబీఎల్ మాతృసంస్థ హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (హెచ్‌సీసీహెచ్) వ్యూహాత్మక పెట్టుబడి ద్వారా 40 శాతం వాటా కొనుగోలు చేసేందుకు విధిగా కట్టుబడి ఉండే ఒప్పందం కుదుర్చుకున్నట్లు భార్తియా గ్రూప్ తన ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాది అక్టోబరులో ఏర్పాటు చేసిన జూబిలెంట్ బెవరేజెస్ లిమిటెడ్ సంస్థ ద్వారా ఈ కొనుగోలు జరుపుతున్నట్లు తెలిపింది. భారత మార్కెట్లో హెచ్‌సీసీబీ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగించడంతోపాటు తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ పెట్టుబడులు దోహదపడనున్నాయని భార్తియా గ్రూప్ పేర్కొంది. నియంత్రణ మండళ్ల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుంది. పార్లే బిస్లెరీకి చెందిన రమేశ్ చౌహాన్ నుంచి థమ్సప్ సహా పలు బ్రాండ్ల కొనుగోలు ద్వారా కోకా-కోలా కంపెనీ 1993లో భారత మార్కెట్లోకి పునః ప్రవేశించింది. అంతర్జాతీయంగా కీలకేతర ఆస్తులను తగ్గించుకునే వ్యూహంలో భాగంగా కోకా-కోలా భారత బాట్లింగ్ బిజినెసలోనూ వాటా విక్రయించింది. హెచ్‌సీసీబీఎల్ ఏపీ, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో బాట్లింగ్ యూనిట్లను కలిగి ఉంది. కోకో కోలా, స్ప్రైట్, థమ్సప్, లిమ్కా, మాజా, ఫాంటా, మినిట్ మెయిడ్, కిన్లే వాటర్ వంటి ప్రముఖ బ్రాండ్లతో సహా మొత్తం 8 విభాగాల్లో 37 భిన్న ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తోంది. కోకా-కోలాకు భారత్ ఐదో అతిపెద్ద మార్కెట్. జూబిలెంట్ భార్తియా గ్రూప్‌నకు చెందిన జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ దేశంలోని అతిపెద్ద క్యూఎస్‌ఆర్ చైన్ ఆపరేటర్లలో ఒకటి. డామినోస్ పిజ్జా, పాపీస్, డంకిన్, హాంగ్స్ కిచెన్, కెఫే బ్రాండ్ కాఫీ సైతం ఈ గ్రూప్‌నకు చెందినవే. భారత్‌తోపాటు ఇతర దేశాలకూ వ్యాపారాన్ని విస్తరించింది. ఇండియా, టర్కీ, బంగ్లాదేశ్, శ్రీలంక, అజర్‌బైజాన్, జార్జియా మార్కెట్లలో మొత్తం 3,130 స్టోర్లను నిర్వహిస్తోంది.

# ఆ కార్లపై భారీ తగ్గింపులు



కాలగమనంలో నడుస్తున్న ఈ ఏడాది చివరి దశకు వచ్చేసింది. మరో 20 రోజుల్లో నూతన సంవత్సరం రానుంది. కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పలు కార్ల కంపెనీలు ఇయర్ ఎండ్ ఆఫర్లు ప్రకటించాయి. తమ ఉత్పత్తులపై భారీ తగ్గింపులను అందిస్తున్నాయి. ప్రముఖ కార్ల తయారీ సంస్థ మహీంద్రా కూడా ఈ వరసలో చేరింది. పలు రకాల ఆఫర్లు, డిస్కౌంట్లతో కస్టమర్లను ఆకట్టుకుంటోంది. కార్ల కంపెనీలు ప్రకటించిన ఆఫర్లతో మార్కెట్ లో సందడి నెలకొంది. కొత్త కార్లు కొనుగోలు చేయాలనుకునే వారికి ఇదే మంచి అవకాశమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొత్త కారుతో కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలకాలనుకునే వారికి డిసెంబర్ చాలా అవకాశాలు కల్పిస్తోంది. మహీంద్రా కంపెనీ కార్లకు మన దేశంతో విపరీతమైన ఆదరణ లభిస్తోంది. మార్కెట్ లో ఈ బ్రాండ్ కు ప్రముఖ స్థానం ఉంది. బ్రాండ్ ఆఫ్ స్టాక్ క్లియరెన్స్ లో భాగంగా మహీంద్రా కంపెనీ ఇయర్ ఎండ్ ఆఫర్ ప్రకటించింది. దీని ద్వారా తన మోడళ్లను భారీ తగ్గింపు ధరలకు విక్రయిస్తోంది. ఎక్స్ యూవీ3ఎక్స్ఓ, థార్ రోక్స్ మినహా మిగిలిన అన్ని మోడళ్లకు ఈ ఆఫర్ వర్తింపజేసింది. ఇయర్ ఎండ్ ఆఫర్ లో ఉన్న ప్రముఖ మోడళ్లు ఇవే. మహీంద్రా బొలెరో నియోపై రూ.1.20 లక్షల తగ్గింపు లభిస్తుంది. దీని ఎక్స్ షోరూమ్ ధర రూ.11.35 లక్షల నుంచి 17.60 లక్షల వరకూ ఉంది. ఇయర్ ఎండ్ ఆఫర్ లో భాగంగా రూ.70 వేల నగదు తగ్గింపు, రూ.30 వేల యాక్సెసరీలు, రూ.20 వేల ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తున్నారు. డిసెంబర్ లో ఈ కారును కొనుగోలు చేయడం వల్ల దాదాపు రూ.1.20 లక్షలు ఆదా చేసుకోవచ్చు. మహీంద్రా కంపెనీ ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో తన తొలి కారు ఎక్స్ యూవీ 400ను ఘనంగా విడుదల చేసింది. రెండు రకాల వేరియంట్లలో ఈ కారును అందుబాటులోకి తీసుకువచ్చింది. సింగిల్ చార్జింగ్ తో సుమారు 450 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చు. ఈ కారుపై కూడా ఇయర్ ఎండ్ ఆఫర్ అందుబాటులో ఉంది. దాదాపు రూ.3 లక్షల తగ్గింపు పొందవచ్చు.

# మూడు రోజుల నష్టాలకు బ్రేక్



స్టాక్ మార్కెట్‌లో మూడు రోజుల వరుస నష్టాలకు బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 16.09 పాయింట్ల లాభంతో 81,526.14 వద్ద ముగియగా నిఫ్టీ 31.75 పాయింట్ల లాభంతో 24,641.80 వద్ద ముగిసింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ బుధవారం ఒక్క రోజే రూ.91,110.2 కోట్లు పెరిగి రూ.460.46 లక్షల కోట్లకు చేరింది. బుధవారం రాత్రి వెలువడే అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల కోసం భారత మార్కెట్ ఆసక్తితో ఎదురు చూస్తోందని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చి విభాగం హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ఐపీఓల సబ్‌స్క్రిప్షన్ అదుర్స్ : బుధవారం ప్రారంభమైన మూడు ఐపీఓలకు మదుపరుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. వన్ మొబిక్విక్ సిస్టమ్స్ ఐపీఓ అయితే ఇష్యూ ప్రారంభమైన తొలి రోజు తొలి గంటలోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది.

రిటైల్ పోర్షన్ ఏడు రెట్లు, నాన్-ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 1.5 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. విశాల్ మెగా మార్ట్ ఇష్యూ తొలి రోజు ముగిసే సమయానికి 51 శాతం సబ్‌స్క్రిప్షన్ సాధించింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 53 శాతం సబ్‌స్క్రిప్షన్ నమోదయింది. సాయి లైఫ్ సైన్సెస్ ఇష్యూ కూడా తొలి రోజు ముగిసే సమయానికి 84 శాతం సబ్‌స్క్రిప్షన్ సాధించింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 18 శాతం సబ్‌స్క్రిప్షన్ వచ్చింది.




# 34కి.మీ మైలేజీ ఇచ్చే కారుకు EMI ఎంత?

ఈ కారును కొనుగోలు చేయాలనుకుంటే, పూర్తి మొత్తాన్ని చెల్లించే బదులు, మీరు ఫైనాన్స్ కూడా చేయవచ్చు. దీని కోసం మీరు డౌన్ పేమెంట్, ఈఎంఐ గణనను అర్థం చేసుకోవాలి. మారుతి సుజుకి వ్యాగన్ఆర్ సిఎన్‌జి. మారుతి సుజుకి కార్లు సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో ఉంటాయి. మంచి మైలేజీని కూడా ఇస్తాయి. ఇండియన్ మార్కెట్లో బాగా ఇష్టపడే ఈ కార్లలో విభిన్న మోడల్స్ ఉన్నాయి. ఈ కార్లలో ఒకటి మారుతి సుజుకి వ్యాగన్ఆర్. కంపెనీ ఈ కారు CNG వెర్షన్‌ను కూడా విక్రయిస్తుంది. మీరు ఈ కారును కొనుగోలు చేయాలనుకుంటే, పూర్తి మొత్తాన్ని చెల్లించే బదులు, మీరు ఫైనాన్స్ కూడా చేయవచ్చు. దీని కోసం మీరు డౌన్ పేమెంట్, ఈఎంఐ గణనను అర్థం చేసుకోవాలి. మారుతి సుజుకి వ్యాగన్ఆర్ సిఎన్‌జి బేస్ మోడల్ ఎల్ఎక్స్ఐ దీని ఆన్-రోడ్ ధర ఢిల్లీలో రూ. 6 లక్షల 45 వేలు. నగరాలను బట్టి ఈ ధర మారవచ్చు. దీని బేస్ మోడల్‌ను కొనుగోలు చేయడానికి మీరు రూ. 1 లక్ష డౌన్ పేమెంట్ చెల్లించాలి. ఈ కారును కొనుగోలు చేయడానికి, మీరు 9.8 శాతం వడ్డీ రేటుతో 5 సంవత్సరాల పాటు బ్యాంక్ లేదా ఫైనాన్స్ కంపెనీ నుండి రుణం తీసుకుంటే, మీకు రూ. 5.45 లక్షల వరకు రుణం లభిస్తుంది. ఇప్పుడు మీరు బ్యాంక్ లేదా కంపెనీ తీసుకున్న ఈ లోన్‌ని EMI రూపంలో తిరిగి చెల్లించాలి. మీరు 5 సంవత్సరాల పాటు వడ్డీ రేటుతో సహా మొత్తం రూ.6.91 లక్షలు బ్యాంకుకు చెల్లించాలి. ఈ రుణాన్ని తిరిగి చెల్లించడానికి మీరు ప్రతి నెలా రూ. 11,000 EMI చెల్లించాలి. రుణం, వడ్డీ రేటు మీ క్రెడిట్ స్కోర్‌పై ఆధారపడి ఉంటుందని తెలుసుకోవడం ముఖ్యం.

# 5 నెలల వ్యాలిడిటీ, 320G B డేటాతో బీఎస్ఎన్ఎల్ చౌకైన రీఛార్జ్ ప్లాన్!

బీఎస్ఎన్ఎల్ చాలా చౌక రీఛార్జ్ ప్లాన్‌లను అందిస్తుంది. ఇది కాకుండా, కంపెనీ అనేక చౌక రీఛార్జ్‌లను కలిగి ఉంది. మీరు వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు. ప్రైవేట్ కంపెనీలు తమ రీఛార్జ్ ప్లాన్‌ల ధరలను పెంచడంతో ప్రజలు BSNL వైపు మొగ్గు చూపుతున్నారు. అటువంటి పరిస్థితిలో చాలా మంది కస్టమర్లు తమ నంబర్లను ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికాం సంస్థ BSNL కి పోర్ట్ చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ చాలా చౌకైన రీఛార్జ్ ప్లాన్‌లను అందజేయడమే దీనికి కారణం. ఈ సిరీస్‌లో బీఎస్ఎన్ఎల్ 5 నెలల చెల్లుబాటుతో కొత్త, చాలా చౌక రీఛార్జ్ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది ఇతర టెలికాం కంపెనీల కంటే చాలా చౌకగా ఉంటుంది.

ప్రైవేట్ కంపెనీలు తమ రీఛార్జ్ ప్లాన్‌ల ధరలను పెంచడంతో ప్రజలు BSNL వైపు మొగ్గు చూపుతున్నారు. అటువంటి పరిస్థితిలో చాలా మంది కస్టమర్లు తమ నంబర్లను ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికాం సంస్థ BSNL కి పోర్ట్




చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ చాలా చౌకైన రీఛార్జ్ ప్లాన్‌లను అందజేయడమే దీనికి కారణం. ఈ సిరీస్‌లో బీఎస్ఎన్ఎల్ 5 నెలల చెల్లుబాటుతో కొత్త, చాలా చౌక రీఛార్జ్ ప్లాన్‌ను ప్రారంభించింది.

ఇది ఇతర టెలికాం కంపెనీల కంటే చాలా చౌకగా ఉంటుంది. ఈ ప్లాన్‌ని యాక్టివేట్ చేయడానికి కస్టమర్ రూ.997 వెచ్చించాల్సి ఉంటుంది. ఇది కస్టమర్‌కు 160 రోజులు (5 నెలలు) చెల్లుబాటును ఇస్తుంది. ఇది కాకుండా, రోజుకు 2GB హై-స్పీడ్ డేటా అందుబాటులో ఉంటుంది అంతకాకుండా ఇది 160 రోజుల్లో మొత్తం 320GB డేటా లభిస్తుంది. రోజువారీ 100 ఉచిత SMS, అపరిమిత వాయిస్ కాలింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. రూ. 997 ఈ గొప్ప బీఎస్ఎన్ఎల్ రీఛార్జ్ ప్లాన్‌లో కస్టమర్ ఆల్ ఇండియా ఫ్రీ రోమింగ్, జింగ్ మ్యూజిక్ BSNL ట్యూన్స్, హార్డీ గేమ్స్, ఛాలెంజర్ అరేనా గేమ్స్, గేమ్ఆన్ ఆస్ట్రోటెల్ వంటి అనేక సేవలను పొందుతారు. బీఎస్ఎన్ఎల్ కొత్త రూ. 997 రీఛార్జ్ ప్లాన్ దీర్ఘ కాల వ్యాలిడిటీ, చౌక డేటా, కాలింగ్ సేవలను కోరుకునే కస్టమర్లకు గొప్ప ఆప్షన్ అనే చెప్పాలి. ఈ ప్లాన్‌లో వినియోగదారులు ఎక్కువ కాలం చెల్లుబాటు పొందుతారు. అలాగే డేటా ప్రయోజనం కూడా పొందుతారు. ఇతర కంపెనీలతో పోలిస్తే బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్ ఉత్తమమైనది. బీఎస్ఎన్ఎల్ చాలా చౌక రీఛార్జ్ ప్లాన్‌లను అందిస్తుంది. ఇది కాకుండా, కంపెనీ అనేక చౌక రీఛార్జ్‌లను కలిగి ఉంది.




# ఆయుష్మాన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

ఉద్యోగం, వ్యాపారాల నుంచి రిటైర్ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సీనియర్ సిటిజన్లందరూ ఎదుర్కొనే పెద్ద సమస్య అనారోగ్యం. వివిధ రకాల వ్యాధులు, అనారోగ్య సమస్యలు ఎప్పుడూ దాడి చేస్తుంటాయి. వారికి వచ్చే పింఛన్లు, ఇతర ఆదాయంలో ఎక్కువ భాగం ఆస్పత్రిలో వైద్య ఖర్చులకు సరిపోతాయి. ఇక పేదవారి సంగతి అయితే చెప్పనవసరం లేదు. వైద్యం చేయించుకోవడానికి డబ్బులు సరిపోక తీవ్ర అవస్థలు పడతారు. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎం జేఏవై)లో రూ.5 లక్షల వరకూ ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. దీనికోసం 70 ఏళ్ల దాటిన వారందరూ ఆయుష్మాన్ వే వందన కార్డును తీసుకోవాలి. ఈ కార్డును ప్రారంభించిన రెండు నెలలలోపే 25 లక్షల మంది నమోదు చేసుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2024 అక్టోబర్ 29వ తేదీన ఆయుష్మాన్ వే వందన కార్డును ప్రారంభించారు. అనంతరం రెండు నెలల్లోనే దాదాపు 25 లక్షల మంది ఈ కార్డు తీసుకున్నారు. దీని ద్వారా 70 ఏళ్లు, అంత కంటే ఎక్కువ వయసున్న సీనియర్ సిటిజన్లందరికీ వారి ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకూ ఉచితం వైద్యం అందిస్తారు. గతంలోనే ఈ పథకం అమల్లో ఉంది. దాని ద్వారా కుటుంబానికి రూ.5 లక్షల విలువైన వైద్యం అందించేవారు. కుటుంబంలోని సభ్యులందరికీ ఇది వర్తించేది. ఇప్పుడు ఆ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా రూ.5 లక్షల వైద్య సాయం అందించేందుకు ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా దీన్ని అమలు చేస్తున్నారు. ప్రపంచంలోని అతి పెద్ద ఆరోగ్య పథకంగా పీఎంజేఏవైని చెప్పవచ్చు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2018 సెప్టెంబర్ 23న జార్ఖండ్ లో దీన్ని ప్రారంభించారు. దీని ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకూ ఆరోగ్య బీమా కవరేజీ అందుతుంది. పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం దీన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా నగదు రహిత చికిత్సలు అందుతాయి. మందులు, చికిత్స రుసుము, డాక్టర్ ఫీజు, ఓటీ-ఐసీయూ ఫీజులు దీనిలోనే ఉంటాయి. సాధారణంగా కుటుంబంలో తల్లిదండ్రులు, పిల్లలు, పెద్దవారు ఉంటారు. వీరిలో పెద్దవారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయి.

# బ్యాంకులకు ఆర్బీఐ సూచనలు


దేశంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఉండాలి. ఇటీవల కాలంలో టెక్నాలజీ విపరీతంగా పెరిగింది. అన్ని పనులు ఆన్ లైన్ లో సులువుగా జరిగిపోతున్నాయి. ముఖ్యంగా బ్యాంకు లావాదేవీలను ఇంటి నుంచే చాలా వేగంగా చేసుకునే వీలు కలిగింది. ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, ఆర్థిక లావాదేవీలు చేయాలన్నా బ్యాంకు ఖాతా చాలా అవసరం. చాలా మంది తమ అవసరాల కోసం బ్యాంకు ఖాతాలను ప్రారంభిస్తారు. ఒకటి, రెండు స్లారు లావాదేవీలు జరిపి వదిలేస్తారు. ఇక వాటిని పట్టించుకోవడంతో డియాక్టివ్ అయిపోతాయి. అయితే ఈ డియాక్టివ్ నిబంధనలలో మార్పులు రానున్నాయి. రిజర్వ్ బ్యాంకు ఇండియా (ఆర్బీఐ) సూచనలు, సలహాల మేరకు బ్యాంకులు తమ కార్యకలాపాలు జరుపుతాయి. వడ్డీ రేట్ల విధింపు, డిపాజిట్ల సేకరణ తదితర విషయాన్ని ఆ నిబంధనలకు అనుగుణంగా ఉంటాయి. బ్యాంకుల నిబంధనల్లో వచ్చే మార్పులకు ఆర్బీఐ నిర్ణయాలే ఆధారమవుతాయి. ఈ నేపథ్యంలో బ్యాంకు ఖాతాల డియాక్టివేషన్ కు సంబంధించి ప్రస్తుత నిబంధనలను మార్చాలని కోరుతూ ఆర్బీఐకి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఫారసులు చేసింది. బ్యాలెన్స్ విచారణ తదితర ఆర్థికేతర కార్యకలాపాలు సైతం ఖ్షాతాను యాక్టివేట్ గా ఉంచడానికి సరిపోయేలా పరిగణించాలని కోరింది.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ సీఎస్ శెట్టి ఇటీవల మాట్లాడుతూ ప్రభుత్వం సహాయం కోసం ఖాతాను తెరిచే వారిలో చాలామంది పరిమితంగానే ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారన్నారు. ఖాతాను ప్రారంభించిన తర్వాత కొన్నిసార్లు మాత్రమే నిధులను ఉపసంహరించుకుంటారన్నారు. నిర్ణీత కాలంలో లావాదేవీలు జరగకపోవడం వల్ల ఈ ఖాతాలు డీయాక్టివ్ అవుతున్నాయన్నారు. దీని వల్ల పలు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఆర్థిక లావాదేవీలు జరగకపోయినా ఆర్థికేతర చర్యలు అంటే ఖాతా తనిఖీ వంటివి జరుగుతుంటే వాటిని కొనసాగించాలన్నారు. ఈ మేరకు నిబంధరలను మార్పు చేయాలని ఆర్బీఐని కోరారు. ఎస్బీఐ సిఫారసులను రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా పరిగణనలోకి తీసుకుంది. ఈ మేరకు బ్యాంకులన్నింటికీ ఆదేశాలు జారీ చేసింది. స్తంభింపజేసిన ఖాతాలను సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరింది. దీంతో బ్యాంకులన్నీ ఆ మేరకు చర్యలు తీసుకున్నాయి. ఎస్బీఐ కూడా వెంటనే రంగంలోకి దిగింది. అయితే ఇలాంటి డియాక్టివ్ ఖాతాలు ఎన్ని ఉన్నాయో స్పష్టంగా తెలపలేదు. ఎక్కువ కాలం పాటు ఆర్థిక లావాదేవీలు జరగని ఖాతాలను క్రియారహిత ఖాతాలు ఉంటారు. కొందరు కస్టమర్లు తమ ఖాతాలను పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. బ్యాంకు నిబంధనల ప్రకారం కొంతకాలానికి ఇవి డియాక్టివ్ అవుతాయి. అనంతరం వాటిలో ఉన్న నగదును తీసుకునే, జమ చేసుకునే అవకాశం ఖాతాదారులకు ఉండదు. వీటిపై ప్రస్తుతం ఆర్బీఐ కొత్తగా చర్యలు తీసుకోనుంది.

# గూగుల్ యూజర్లకు గుడ్ న్యూస్.. అందుబాటులోకి ఏఐ పవర్డ్ ఫీచర్లు

ప్రస్తుతం ఏ విషయం గురించి తెలుసుకోవాలన్నా గూగుల్ లో సెర్చ్ చేయడం అందరికీ అలవాటు. గుండుసూది నుంచి అంతరిక్షం వరకూ అన్ని అంశాలు దానిలో ఉంటాయి. చేతిలో సెల్ ఫోన్ ఉంటే చాలు ప్రపంచమంతా దగ్గర ఉన్నట్టే. గూగుల్ కూడా కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు అనేక అప్ డేట్లు చేస్తుంది. దీనిలో భాగంగా ఆండ్రాయిడ్ పరికరాల కోసం ఆర్టిఫీషియల్ పవర్డ్ ఫీచర్ల కొత్త సెట్ ను ప్రారంభించింది. ఆండ్రాయిడ్ 15 పరికరాలన్నింటికీ దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గూగుల్ తెలిపిన వివరాల ప్రకారం కొత్త సెట్ ఏఐ ఫీచర్లు వినియోగదారులకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిలో ఆడియో క్యాప్షన్లు, ఇమేజ్ వివరణలు, కొత్త స్టిక్కర్ కాంబో తదితర వాటిని ప్రవేశపెట్టారు. అలాగే గూగుల్ ఫిక్సెల్ స్మార్ట్ ఫోన్ల కోసం ప్రత్యేకంగా అదనపు ఫీచర్లను విడుదల చేశారు. ఇవన్ని రాబోయే కొన్ని వారాల్లో అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. గూగుల్ కొత్త ఏఐ ఫీచర్ల ప్రత్యేకతలను తెలుసుకుందాం.

ఎక్స్‌ప్రెసివ్ క్యాప్షన్ ఫీచర్ లో భాగంగా మీకు క్యాప్షన్ పంపిన వారి భావోద్వేగాన్ని తెలుసుకోవచ్చు.




వాల్యూమ్,టోన్, పదాల కంటే శబ్దాలపై ఎక్కువ శ్రద్ధ పెడుతుంది. క్యాప్షన్లలో గుసగుసలు, చీర్స్, చప్పట్లు అన్ని తెలుస్తాయి. అంధులు, తక్కువ కంటి చూపు ఉన్నవారి కోసం ఇమేజ్ క్యూఅండ్ఏ ఇన్ లుక్ అవుట్ అనే ఫీచర్ చాలా ఉపయోగపడుతుంది. మీ పరిసరాల గురించిన సమాచారాన్ని మీకు అందిస్తుంది. ఈ యాప్ ద్వారా ఒక ఫొటోను తీసి అప్ లోడ్ చేయండి. దాని గురించి వివరాలు మీకు బిగ్గరగా పైకి చెబుతుంది. ఎమోజీ కిచెన్ అనే ఫీచర్ తో మీకు కావాల్సిన ఎమోజీలను రూపొందించుకునే వీలుంటుంది. దీని ద్వారా రెండు ఎమోజీలను కలిపి ఓ ప్రత్యేకమైన స్టిక్కర్ గా మార్చుకోవచ్చు. ఇది ఆపిల్ లోని జెన్మోజీని పోలి ఉంటుంది. కానీ అది ఇంకా అందుబాటులోకి రాలేదు. ఎమోజీ కిచెన్ మాత్రం అందరికీ అందుబాటులో ఉంది. క్యూఆర్ కోడ్ ఫీచర్ తో ఫొటోలు, వీడియోలు, పత్రాలను వేరొకరికి పంపడం మరింత సులభంగా, సురక్షితంగా ఉంటుంది. ముందుగా మీరు పంపాలనుకున్న మీడియా ఫైల్ ను ఎంపిక చేసుకోవాలి. క్యూఆర్ కోడ్ ను నొక్కాలి. సురక్షిత బదిలీ కోసం ఇతరులను స్కాన్ చేయాలి. గూగుల్ డిస్క్ ఫీచర్ ద్వారా మెరుగైన స్కాన్ సేవలు పొందవచ్చు. రశీదులు, పత్రాలు, గుర్తింపు కార్డులను సరైన కాంట్రాస్ట్, వైట్ బ్యాలెన్స్ తో మాన్యువల్ ఎడిటింగ్ లేకుండా సేవ్ చేసుకోవచ్చు. వాటిని ఫొటో తీసిన వెంటనే ఈ ఫీచర్ ద్వారా డిజిటల్ వెర్షన్ లో సేవ్ అవుతాయి.

# ఒక్క అక్షరంతో రెండు కంపెనీల మధ్య వివాదం

మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ లిమిటెడ్ నుంచి విడుదల కానున్న ఎలక్ట్రిక్ కారు పేరు మారింది. మహీంద్రా బీఈ 6ఈ పేరుతో లాంచింగ్ సమయంలో ఈ కారును విడుదల చేశారు. ఈ పేరుపై ప్రముఖ విమానాయాన సంస్థ ఇండిగో అభ్యంతరం తెలిపిన విషయం తెలిసిందే. దీంతో పేరులో స్వల్పంగా మార్పు చేయాలని మహీంద్రా నిర్ణయించింది. ఇక నుంచి బీఈ 6గా పిలవనుంది. ఇండిగా అభ్యంతరాల నేపథ్యంలో ఈ అనే అక్షరాన్ని తొలగించింది. ఒక్క చిన్న అక్షరంతో రెండు దిగ్గజ కంపెనీల మధ్య వివాదం రేగింది. మహీంద్రా కంపెనీ ఇటీవల ఈవీ విభాగంలో బీఈ 6ఈ అనే మోడల్ కారును ఆవిష్కరించింది. 2025 ఫిబ్రవరిలో మార్కెట్ లోకి విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. అయితే 6ఈ అనే పేరుపై ఇండిగో సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసింది. తాము 6ఈ బ్రాండింగ్ ను ఇప్పటికే వివిధ సేవల్లో వినియోగిస్తున్నామని తెలిపింది. విమాన సర్వీసులతో పాటు 6ఈ ఫ్లెక్స్, 6ఈ లింక్, 6ఈ ప్రైమ్ తదితర వాటిని అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో మహీంద్రా కంపెన తన కారు 6ఈ పేరు పెట్టడాన్ని ఖండించింది. వివాదం కోర్టు వరకూ వెళ్లడంతో మహీంద్రా కంపెనీ తన కారు పేరు మార్చడానికి నిర్ణయం తీసుకుంది. తన కారులోని ఈ అనే పేరును తొలగించింది. ఇండిగో నిరాధర ఆరోపణలు చేస్తోందని, దీనిపై కోర్టులో తమ పోరాటం ొనసాగుతుందని వెల్లడించింది. తమ ఖాతాదారులకు మెరుగైన ఉత్పత్తులను పరిచయం చేయడం, మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపింది.మహీంద్రా కంపెనీ



ప్రతినిధులు ఈ విషయంపై స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఇండిగో సంస్థ వాడుతున్నబ్రాండింగ్ 6ఈ అని, తమ కొత్త కారు పేరు బీఈ 6ఈ అని వివరణ ఇచ్చారు. తాము కేవలం 6ఈ అనే పేరును మాత్రమే వాడడం లేదని, దానికి ముందు బీఈ కూడా ఉందని తెలిపారు. కాబట్టి ఈ పేర్ల మధ్య తేడాలు ఉన్నాయన్నారు. ఏది ఏమైనా ఇండిగో విమానయాన సంస్థ అభ్యంతర నడుమ తన కారు పేరును స్వల్పంగా మార్పు చేయాలని మహీంద్రా కంపెనీ నిర్ణయించుకుంది. ఈ కారు విడుదల ముందే వివాదంలో చిక్కుకోవడంతో ఈ చర్యలు తీసుకుంది.

కేవలం ఒక్క ఈ అనే చిన్న అక్షరం రెండు పెద్ద కంపెనీల మధ్య వివాదానికి కారణమైంది.

# రాజ్యసభ ఛైర్మెన్‌ది పక్షపాత ధోరణి



న్యూఢిల్లీ : రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధన్కర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఇండియా బ్లాక్ పార్టీలు విమర్శించాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆయన రాజకీయాలు నడుపుతున్నారని ధ్వజమెత్తాయి. అందుకే జగదీప్ ధన్కర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టామని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. బుధవారం నాడిక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. ధన్కర్ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిలా వ్యవహరిస్తున్నారని, అనుభవజ్ఞులైన ప్రతిపక్ష నేతలను సభలో మాట్లాడకుండా తరచూ అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఆయన ప్రతిపక్షం పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. సభను నియమ నిబంధనలతో కాకుండా రాజకీయాలతో నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. "ఉపరాష్ట్రపతి పదవి రాజ్యాంగ బద్ధంగా రెండోది. ఇప్పటి వరకు ఆ పదవి నుంచి తొలగించే తీర్మానం ఎన్నడూ రాలేదు. ఎందుకంటే గతంలో అధికారంలో ఉన్న వారందరూ ఎప్పుడూ రాజకీయంగా లేరు. కానీ నేడు పార్లమెంటులో రాజకీయాలు జరుగుతున్నాయని చెప్పవలసి వచ్చింది. అధికార పార్టీ సభ్యులు మాట్లాడినప్పుడు జోక్యం చేసుకోరు. అదే ప్రతిపక్ష సభ్యులు మాట్లాడితే వెంటనే జోక్యం చేసుకుంటారు. స్వాతంత్ర్యం వచ్చిన 75వ సంవత్సరంలో పక్షపాతంతో కూడిన వైఖరి వల్ల అవిశ్వాస తీర్మానం తీసుకురావాల్సి వచ్చింది. ఛైర్మెన్ కొన్నిసార్లు ప్రభుత్వాన్ని పొగిడేవారు. మరి కొన్నిసార్లు తనను తాను ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తినని పేర్కొనేవారు. నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసేవారు" అని ఖర్గే అన్నారు. "సభా నాయకుడు మాట్లాడినప్పుడు ఎంత అవకాశం ఇస్తారో, ప్రతిపక్షనేతగా తాను మాట్లాడినప్పుడు కూడా అంతే అవకాశం ఇవ్వాలి. అదే రూల్ చెబుతోంది. కానీ ఛైర్మెన్ అలా చేయరు. అతని ప్రవర్తన దేశ గౌరవాన్ని దెబ్బతీసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో ఆయన అలాంటి పరిస్థితిని తెచ్చిపెట్టారు. అందుకే అవిశ్వాసం తీర్మానం తీసుకురావాల్సి వచ్చింది. రాజ్యాంగం గురించి చాలా ఆలోచించిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే మేము ఈ చర్య తీసుకున్నాం. అదే దేశ ప్రజలకు చెప్పాలనుకుంటున్నాం" అని అన్నారు. "రాజ్యాంగం, రాజ్యాంగ సంప్రదాయానికి బదులు ఆయన తన తదుపరి పదోన్నతి కోసం ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేస్తున్నారు. సభకు సంరక్షకుడిగా, ప్రతి సభ్యుని హక్కుల పరిరక్షకుడిగా ఛైర్మెన్ రాజకీయాలకు అతీతంగా ఉండాలి. కానీ ప్రతిపక్ష పార్టీలను బహిరంగంగా విమర్శించే అధికార పక్షానికి అధికార ప్రతినిధిలా ప్రవర్తించే ఉపరాష్ట్రపతిని మన చరిత్రలోనే తొలిసారి చూస్తున్నాం. ఈ నోటీసుతో ముందుకు వెళ్లడం తప్ప మాకు వేరే మార్గం లేకుండా పోయిందని చెప్పడానికి నేను చాలా బాధపడ్డా. గత మూడేండ్లుగా క్లిష్టమైన సమస్యలను లేవనెత్తడానికి సమయం ఇవ్వకుండా, సీనియర్ సభ్యులను సైతం తక్కువ చేసి మాట్లాడారు" అని ఖర్గే అన్నారు.

# దక్షిణ కొరియా మాజీ మంత్రి ఆత్మహత్యాయత్నం



సియోల్ : దక్షిణ కొరియా రక్షణశాఖ మాజీ మంత్రి కిమ్‌యాంగ్ హ్యూన్, పోలీస్‌ల కస్టడీ లోనే ఆత్మహత్యకు ప్రయత్నించారు. కానీ చివరినిమిషాల్లో ఆయన ప్రయత్నాలను అడ్డుకున్నారు. గత రాత్రి బలవన్మరణానికి పాల్పడేందుకు కిమ్ ప్రయత్నించారు. గత ఆదివారం నుంచి ఆయన గృహ నిర్బంధంలో ఉన్నారు. మంగళవారం ఆయనను అధికారికంగా పోలీస్‌లు అరెస్ట్ చేశారు. అరెస్టుకు కొన్ని నిమిషాల ముందు హ్యూన్ ఆత్మహత్యకు ప్రయత్నించారు. తనను అరెస్టు చేయబోతున్నారని తెలియగానే ఆయన ఆత్మహత్యకు ప్రయత్నించారని కొరియా పార్లమెంట్ లో కమిషనర్ జనరల్ ఆఫ్ కొరియా కరెక్షనల్ సర్వీస్ తెలియజేశారు. కొరియా మీడియా సంస్థ షిన్‌యోంగ్ హేలో కథనం ప్రకారం హ్యూన్ డిటెన్షన్ సెంటర్ లోని టాయిలెట్‌కు వెళ్లి అక్కడ తన అండర్‌వేర్‌తో ఉరిపోసుకోడానికి ప్రయత్నించారు. కానీ కరెక్షనల్ అధికారులు ఆయన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ప్రస్తుతంఆయనను గార్డింగ్ రూమ్‌లో పెట్టారు. ఇటీవల దక్షిణ కొరియా నుంచి సైనిక పాలన ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రతిపాదన చేసింది మంత్రి కిమ్. దక్షిణ కొరియాలో డిసెంబర్ 3న సైనిక పాలన విధిస్తూ ప్రకటన చేశారు. కొరియాలో సైనికపాలన విధించే ప్రయత్నం చేశారన్న ఆరోపణలపై అధ్యక్షుడు యూన్‌సుక్ ఇయోల్ విచారణ ఎదుర్కొంటున్నారు. ఈకేసులో రక్షణ మంత్రి కూడా ప్రధాన నిందితుడిగా ఉన్నారు. అరెస్టుకు ముందు ఆయన తనకు వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను నాశనం చేసేందుకు ప్రయత్నించారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. హ్యూన్‌ను కఠినంగా శిక్షిస్తామని బుధవారం కొరియా కోర్టు ప్రతినిధి తెలిపారు. సైనిక పాలన విధించే విషయంలో ఆధారాల కోసం అధ్యక్షుడు కార్యాలయం లో పోలీస్‌లు తనిఖీలు చేయడం విశేషం.

# తైవాన్ చుట్టూ చైనా బలగాల మోహరం



బీజింగ్ : తైవాన్ ద్వీపం చుట్టుపక్కల సముద్ర జలాల్లో చైనా దూకుడు పెరిగింది. మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేని స్థాయిలో డ్రాగన్ తన బలగాలను తైవాన్ చుట్టుపక్కల మోహరించింది. దీంతో తైవాన్ జలసంధిలో సైనిక కార్యకలాపాలు పెరిగాయి.

తాజాగా చైనా తన మోహరింపులపై బుధవారం స్పందించింది. తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పింది. వేర్పాటువాద కార్యకలాపాలను ఏమాత్రం సహించమని పేర్కొంది. చైనా లోని తైవాన్ అఫైర్స్ ఆఫీస్ విభాగం ప్రతినిధి ఝుఫెంగ్లియాన్ మాట్లాడుతూ.. " తైవాన్ వేర్పాటువాదులు బాహ్యశక్తులతో కుమ్మక్కు అయ్యే చర్యలపై బీజింగ్ అత్యంత అప్రమత్తంగా ఉంది. మా దృష్టిలోకి రానిది ఏదీ జరగనీయం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటానికి తైవాన్ జలసంధిలో సుస్థిరత నెలకొల్పడానికి అన్ని చర్యలు తీసుకొంటాం" అన్నారు. మరోవైపు ఈ మోహరింపులు ఎందుకోసమనే అంశంపై పీఎల్‌ఏ ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇటీవల తైవాన్ అధ్యక్షుడు లాయ్ చింగ్ తె అమెరికాకు చెందిన హవాయి, గువామ్‌లో పర్యటించారు. ఈ చర్యలు బీజింగ్‌కు తీవ్ర ఆగ్రహం కలిగించాయి. ఈ నేపథ్యంలో తైవాన్ చుట్టుపక్కల భారీగా సైనిక మోహరింపులు మొదలు పెట్టింది. దీనిపై తైవాన్ సీనియర్ అధికారి ఒకరు ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ అమెరికాలో కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న కార్యవర్గానికి ఓ రాజకీయ సందేశం పంపడం కోసం బీజింగ్ ఇలా చేస్తోందని అభిప్రాయపడ్డారు. దాదాపు 70 రోజుల పాటు చైనా సైన్యం ప్లానింగ్ చేసి ఆమేరకు తాజాగా మోహరింపులు చేపట్టిందని తైవాన్ మిలిటరీ అంచనా వేసింది. ఇప్పటికే తైవాన్ అధ్యక్షుడు లాయ్ ప్రభుత్వం తమ దేశంపై బీజింగ్ సార్వభౌమ హక్కులను కొట్టిపారేసింది. మంగళవారం తైవాన్ రక్షణ మంత్రిత్వశాఖ స్పందిస్తూ గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేని స్థాయిలో బీజింగ్ తన నౌకాదళాన్ని మోహరించిందని వెల్లడించింది. గతంలోచైనా చేసిన యుద్ధ విన్యాసాల కంటే ఇది తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొంది.

# కేరళపై కేంద్రం వివక్ష



కేరళలోని వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఆ రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని, అటువంటి రాష్ట్రంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కత్తిగట్టినట్టు వ్యవహరించడం దారుణమని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ విమర్శించారు. కేరళ వామపక్ష ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర ప్రజలకు మద్దతుగా సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు ఆధ్వర్యాన సంఘీభావ సభ విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం జరిగింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విజూ కృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో ప్రత్యామ్నాయ విధానాలతో కేరళ ముందుకు సాగుతోందన్నారు. అక్షరాస్యత, వైద్య సౌకర్యాలు, కనీస వేతనాలు, భూ పంపిణీ, పౌరసరఫరాల వ్యవస్థ, రైతు పంటకు మద్దతు ధర, కార్మికులు, వ్యవసాయ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలులో దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. ఎనిమిది రకాల కూరగాయల పంటలతో సహా అన్ని పంటలకూ మద్దతు ధరలు ఇచ్చి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా పేరుతో ఇటీవల రైతులకు సహాయం చేస్తోందని, కానీ కేరళలో మొదటి నుంచి పంచాయతీల ద్వారా రూ.32 వేలు ఆర్థిక సహాయం రైతులకు అందిస్తోందన్నారు. వ్యవసాయ కార్మికులకు రోజువారీ వేతనం రూ.700, అసంఘటిత కార్మికులకు వెయ్యి రూపాయల కనీస వేతనం అమలు చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.14 వేల వేతనాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఎయిర్‌పోర్టును ప్రైవేట్‌వారికి కాకుండా తమకు అప్పగించాలని కేరళ ప్రభుత్వం కోరినా కేంద్రం నిరాకరించిందన్నారు. రాజ్యాంగం ప్రకారం కేరళకు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో కోతలు విధిస్తుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను స్తంభింపజేయడం వల్ల ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎపికి జగన్ ప్రభుత్వ హయాంలో రుణ పరిమితులు విధించని కేంద్రం, కేరళకు మాత్రం విధించిందని చెప్పారు. వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి విపత్తులో వందల మంది మరణించడంతో పాటు వేలకోట్ల ఆస్తి నష్టం జరిగిందని, అయినా జాతీయ విపత్తు నిధి నుంచి కేరళ రాష్ట్రానికి కేంద్రం రూపాయి కూడా సహాయం చేయలేదన్నారు.

# సిరియాపై ఇజ్రాయిల్ విధ్వంసకాండ




డమాస్కస్ : సిరియా వ్యాప్తంగా ఇజ్రాయిల్ భారీగా విధ్వంసానికి తెగబడుతోంది. సిరియా భూభాగం లోపలకు ఇజ్రాయిల్ బలగాలు చొచ్చుకుపోయాయని సిరియా ప్రతిపక్ష యుద్ధ పర్యవేక్షక సంస్థ తెలిపింది. సిరియా నావికాదళాన్ని మొత్తంగా నాశనం చేశామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ప్రకటించారు. దక్షిణ సిరియాలో నిస్సైనికీకరణ మండలాన్ని ఏర్పాటు చేస్తామని రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ పేర్కొన్నారు. సిరియాలో తీవ్రవాదం వేళ్ళూనుకోకుండా నివారించేందుకే ఈ చర్యలని చెప్పారు. అసద్ పంథాను ఎవరు అనుసరించినా వారికి అసద్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అసద్‌ను పదవీచ్యుతుడిని చేసిన తర్వాత బఫర్ జోన్‌లోకి ప్రవేశించామని ఇజ్రాయిల్ ఇప్పటికే ప్రకటించింది. అయితే ఆ ప్రాంతాన్ని దాటి ఇంకా ముందుకెళ్లాయా లేదా అనేది స్పష్టంగా తెలియరాలేదు. ఈ బఫర్ జోన్‌ను 50ఏళ్ళ క్రితం ఏర్పాటు చేశారు. అయితే రాజధాని డమాస్కస్ లోపలకు చొచ్చుకు వెళ్ళామనడాన్ని ఇజ్రాయిల్ తిరస్కరిస్తోంది. గత 48గంటల్లో 350కి పైగా వైమానిక దాడులకు పాల్పడ్డామని మిలటరీ ప్రకటించింది. దేశంలోని వ్యూహాత్మక ఆయుధ నిల్వల కేంద్రాలను చాలావరకు ధ్వంసం చేసేశామని తెలిపింది. తీవ్రవాదుల చేతుల్లోకి ఆ ఆయుధాలు వెళ్ళకూడదనే ఉద్దేశ్యంతోనే ఈ దాడులు జరిపామంటూ సమర్ధించుకుంది. సిరియా నావికాదళానికి చెందిన రెండు నౌకాశ్రయాలపై ఒకేసారి క్షిపణి నౌకలతో దాడి చేశామని మిలటరీ తెలిపింది. అక్కడ మొత్తంగా 15నౌకలు వున్నాయని పేర్కొంది. అయితే వాటిల్లో ఎన్ని నౌకలపై దాడి చేశామన్నది వివరించలేదు. సోవియట్ శకానికి చెందిన ఆరు క్షిపణి నౌకలు దాడికి గురయ్యాయని ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ అంబ్రే వెల్లడించింది. కాగా ప్రస్తుతం సిరియాలో ఎక్కువ భాగాన్ని నియంత్రిస్తున్న హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) నేతృత్వంలోని తీవ్రవాద గ్రూపుల నుండి ఎలాంటి స్పందన వెలువడలేదు.

# తెలంగాణలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కాదు

న్యూఢిల్లీ: తెలంగాణలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కాదని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. తెలంగాణ లో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ స్థాపనకు అవకాశం లేదని పరోక్ష్యంగా బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పై కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం లోక్ సభలో బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు ముడి ఇనుము నిల్వల కేటాయింపు అంశాన్ని పెద్దపల్లి గడ్డం వంశీకృష్ణ లేవనెత్తారు. ఈ ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలోని మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలలో తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎస్ఎండీసీఎల్) కు ఎలాంటి ముడి ఇనుము, ఖనిజ నిల్వలు కేటాయించలేదని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు వీలుగా తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు 65.20 చదరపు కిలోమీటర్ల పరిధిలో ముడి ఇనుము, ఖనిజ నిల్వల కోసం 2019లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనను కేంద్ర ఉక్కు శాఖ తో పాటు ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ పరిశీలించాయని తెలిపారు. ఈ పరిశీలనలో తెలంగాణలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్) ఆధ్వర్యంలో సమీకృత స్టీల్ ప్లాంట్ సాధ్యం కాదని పరిశీలనలో స్పష్టమైందని చెప్పారు. ముడి ఇనుము, ఖనిజ ఏరియా ను రిజర్వు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను 2021లో రాష్ట్రానికి తిరిగి పంపించినట్టు సమాధానంలో స్పష్టం చేశారు.

# అరుదైన లోహాలను కొల్లగొట్టేందుకు మోడీ సర్కార్ కసరత్తు



చెన్నై : దేశ ప్రజలపై భారాలు మోపుతూ, ప్రకృతి సంపదను ధ్వంసం చేస్తూ దేశంలోని బడా కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్జేస్తోందని సీపీఐ(ఎం) సమన్వయకర్త, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ విమర్శించారు. దేశంలో అత్యంత అరుదైన ఖనిజాలను కూడా భూగర్భం నుంచి వెలికి తీసి ఆ సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ సర్కార్ సిద్ధమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులోని దిండిగల్ జిల్లాలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. మదురైలో టంగ్‌స్టన్ సహా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అత్యంత అరుదైన ఖనిజాలను తవ్వితీసి బడా కార్పొరేట్లకు కోట్లవర్షం కురిపించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల కార్యాచరణ ప్రకటిం చిందని, ఈ దుర్మార్గమైన విధానాన్ని ప్రజలందరూ తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మదురైలో అరుదైన టంగ్‌స్టన్ ఖనిజ తవ్వకాలను చేపట్టాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించడాన్ని కరత్ ఈ సందర్భంగా స్వాగతించారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణ, కేంద్ర కమిటీ సభ్యులు యు వాసుకి నాయకులు పాల్గొన్నారు.

# పెరిగిన మానవ అక్రమ రవాణా

వియన్నా : అంతర్జాతీయంగా మానవుల అక్రమ రవాణా పెరిగిందని ఐక్యరాజ్య సమితి సంస్థ యుఎన్‌ఓడిసి పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఒక నివేదికను వెలువరించింది. 2019లో కరోనా ముందు నాటి స్థాయితో పోల్చితే 2022లో ఈ అక్రమ రవాణా బాధితుల సంఖ్య 25శాతం మేరా పెరిగిందని పేర్కొంది. వ్యక్తుల అక్రమ రవాణాపై 2024 గ్లోబల్ రిపోర్ట్‌ను మాదకద్రవ్యాలు, నేరాలపై ఐక్యరాజ్య సమితి కార్యాలయం (యుఎన్‌ఓడిసి) ప్రచురించింది. ఇందుకు దారిద్ర్యం, ఘర్షణలు, వాతావరణ విపత్తులు వంటి అంశాలను కారణాలుగా చూపింది. వీటివల్ల ప్రజలు దోపిడీకి గురి కావడానికి అవకాశాలు పెరిగాయని పేర్కొంది. బాలల రవాణా, బలవంతంగా కార్మికులను తరలించడం, అలాగే బలవంతంగా నేరాలు చేయించడం వంటి అంశాలు కూడా ఇదే కాలంలో పెరిగాయని ఆ నివేదిక పేర్కొంది. అంతర్జాతీయంగా చూసినట్లైతే వెట్టి చాకిరి కోసం తరలించే బాధితుల సంఖ్య 2019తో పోలిస్తే 2022లో 47 శాతం పెరిగింది. బాలల బాధితుల సంఖ్య 31 శాతం పెరిగింది. ఇక బాలికల అక్రమ రవాణా 38 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. 156 దేశాలకు చెందిన డేటాను ఈ నివేదిక విశ్లేషించింది. ప్రపంచవ్యాప్తంగా 2022లో ఈ అక్రమ రవాణా బాధితుల్లో మహిళలు, బాలికలు 61 శాతం వున్నారని వెల్లడించింది. వీరిలో 60శాతం మంది బాలికలను లైంగిక దోపిడీ కోసమే బలవంతంగా తరలించారని పేర్కొంది. ఆన్‌లైన్ కుంభకోణాలతో సహా బలవంతంగా నేరాలకు పాల్పడేలా చేయడం కూడా బాగా పెరిగిందని పేర్కొంది. 2016లో ఇటువంటి నేరాల సంఖ్య కేవలం ఒక్క శాతమే వుండేదని 2022నాటికి 8శాతానికి పెరిగిందని నివేదిక తెలిపింది.

ఇందుకు పాల్పడేవారిని జవాబుదారీగా చేయడానికి బలోపేతమైన క్రిమినల్ జస్టిస్ చర్యలు తీసుకోవాల్సి వుందని యుఎన్‌ఒడిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఘడా వాలీ పిలుపిచ్చారు. బాధితులను కాపాడేందుకు, దీన్నుండి బయటపడిన వారికి సాయమందించేందుకు దేశాల మధ్య సహకారం కూడా పెరిగాల్సి వుందన్నారు.

